RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 229 మేడ్చల్ మల్కాజ్‌గిరి 10 సెప్టెంబర్ 2024 మంగళవారం పేజీలు : 4

## పాక్‌తో చర్చల్లేవ్... తెగేసిచెప్పిన అమిత్‌షా

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో శాంతి నెలకొనేంత వరకూ పాకిస్థాన్‌తో చర్చలు జరిపే ప్రసక్తే లేదని కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా తెలిపారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని హెూం మంత్రి జమ్మూలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ, రాబోయే ఎన్నికలు చరిత్రాత్మకమని, ఎన్నికల ప్రచారాన్ని బీజేపీ ప్రారంభిం చిందని అన్నారు. తొలిసారి రెండు జెండాల నీడలో కాకుండా ఒకే జెండా త్రివర్ణ పతాకం కింద ఇక్కడి ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకుంటు న్నారని అన్నారు. "ఇద్దరు ప్రధానులు ఉండరు, ఒకరే ప్రధాని. యావద్దేశం ఎన్నుకున్న ప్రధానమంత్రి మన మోదీ. చాలా స్పష్టంగా ఒకమాట చెప్పదలచుకున్నాను. బీజేపీ ఈ ఎన్నికల్లో పూర్తి శక్తిసామర్థ్యాలతో పోరాడుతుంది, గెలుపు సాధిస్తుంది" అని అమిత్‌షా ధీమా వ్యక్తం చేశారు.

# ప్రక్షాళన షురూ!

## అర్హులకే కొత్త కమిటీలలో చోటు!!




హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ దూకుడు చూపిస్తోంది. ఒకపక్క కీలక నిర్ణయాలు తీసుకుంటూ ప్రభుత్వంలో తనదైన ముద్ర వేసేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తుండగా క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేస్తుంది. ఇప్పటికే తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ ను నియమించింది. రేవంత్ సన్నిహితుడైన మహేష్ కుమార్ ను నియమించడం వెనుక కాంగ్రెస్ అధిష్టానం వ్యూహాత్మకంగానే వ్యవహరించింది. ఇక పార్టీలో ఇతర కీలక పదవులను భర్తీ చేసేందుకు కసరత్తు మొదలుపెట్టింది. ఈ మేరకు కొత్త కమిటీల ఏర్పాటుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. వైస్ ప్రెసిడెంట్ లు, వర్కింగ్ ప్రెసిడెంట్లు, సెక్రటరీలు, జనరల్ సెక్రటరీలు, జాయింట్ సెక్రటరీలు , ఆఫీస్ బేరర్లు , ఆర్గనైజేషన్ మెంబర్లు , పార్టీ ఫ్రెంటల్ ఆర్గనైజేషన్స్ తదితర పదవులను భర్తీ చేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది . రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా స్థాయిలో కమిటీలు అన్నిటిని ఏర్పాటు చేయనున్నారు . కొత్త పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యం లోనే పార్టీకి సంబంధించిన పదవులు అన్నిటిని భర్తీ చేయనున్నారు. త్వరలోనే దరఖాస్తులు స్వీకరణ మొదలుపెట్టనున్నట్లు సమాచారం. అయితే ఈ దరఖాస్తులు మొదటి నుంచి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ, క్షేత్రస్థాయిలో కష్టపడిన వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు సమాచారం. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో పార్టీ పదవులకు గట్టి పోటీనే ఉంటుందనే అంచనాలో ఉన్నారు. ఇప్పటి వరకు పిసిసి కార్యవర్గంలో వివిధ హెూదాల్లో పనిచేసిన కొంతమంది నేతలను కొత్త కమిటీల్లోకి తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాంగ్రెస్ లో పదవుల భర్తీ మొదలు పెడుతున్నారనే సమాచారంతో అప్పుడే పైరవీలు మొదలయ్యాయి. తమ అనుచరులకు పదవులు ఇప్పించుకునేందుకు రాష్ట్రస్థాయి నాయకులు ఒత్తిళ్లు మొదలుపెట్టారు. రాష్ట్రస్థాయి పదవుల నుంచి జిల్లా స్థాయి పదవుల వరకు తీవ్ర పోటీ నెలకొనే అవకాశం కనిపిస్తోంది. అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల టికెట్లకు దరఖాస్తు చేసినట్లే పార్టీ పదవుల కోసమూ దరఖాస్తులను స్వీకరించనున్నారు వచ్చిన దరఖాస్తుల జాబితాలను ఏఐసిసికి పంపించి అభ్యర్థుల జాబితాను ఫైనల్ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. అభ్యర్థుల జాబితాను ఏఐసీసీకి పంపించడం ద్వారా రాష్ట్రంలోని మంత్రులు ఇతర ముఖ్య నాయకులు మధ్య భేదాభిప్రాయాలు ఉండవని రాష్ట్ర నాయకత్వం భావిస్తోందట.

## ఈనెల 13న ఎన్నికలు.. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యనే పోటీ

## ఓటర్లను కాపాడుకునేందుకు ఇరువర్గాలు ముమ్మర ప్రయత్నాలు




నల్గొండ : మదర్ డెయిరీ ఎన్నికల్లో క్యాంపు రాజకీయాలు జోరందుకున్నాయి. శని, ఆదివారాలు సెలవు రోజులు కాగా.. క్యాంపు పాలిటిక్స్ షురూ చేసేందుకు ఇరు వర్గాలు ఏర్పాట్లు చేసుకున్నాయి. ఆలేరు కేంద్రంగా జరుగుతున్న ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్ రెడ్డి మధ్య నువ్వా నేనా..అనే రీతిలో హెూరాహెూరీ నడుస్తున్నాయి. ఈనెల13న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇరువర్గాలు తమ ఓటర్లను క్యాంపులకు తరలించేందుకు సిద్ధమవుతున్నాయి. 297 మంది సొసైటీ చైర్మన్లు ఓటర్లు. దీంట్లో కాంగ్రెస్ ఓటర్లు రెండొందలకు పైగా ఉండగా.. బీఆర్ఎస్ ఓటర్లు 80 మందికి పైగా ఉన్నారు.

ఎ న్నికల నాటికి ఓటర్లు చేజారిపోకుండా ఉండేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. డెయిరీ ఎన్నికల బాధ్యతలు నిర్వరిస్తున్న ఎమ్మెల్యే అయిలయ్య తనవర్గాన్ని కాపాడుకునేందుకు వ్యూహాన్ని రూపొందించారు. డీసీసీబీలో మెజార్టీ డైరెక్టర్లు బీఆర్ఎస్ వైపే ఉన్నప్పటికీ తన చైర్మన్ పీఠాన్ని కాపాడుకోవడంలో మహేందర్ రెడ్డి విఫలమయ్యారు. అవిశ్వాస తీర్మానం పెట్టేవరకు అన్నిరకాల ప్రయత్నాలు చేశారు. ఇప్పుడు కూడా ఆలేరులో రాజకీయంగా తన ఆధిపత్యాన్ని కాపాడుకునేందుకు శతవిధాల ప్రయత్నిస్తున్నారు. ఓటుకు రూ.30 వేల వరకైనా ఖర్చు పెట్టేందుకు వెనకాడేది లేదని ఇరువర్గాలు సవాల్‌చేస్తున్నాయి. అయిలయ్య మద్దతుదారుడు మధుసూదన్ రెడ్డి చైర్మన్ అభ్యర్థిగా బరిలో ఉండగా, మహేందర్‌రెడ్డి ప్యానల్ నుంచి కొండల్‌రెడ్డి పోటీలో ఉన్నారు. డెయిరీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌అనేది సర్వసాధారణం. అయితే ఆలేరులోనే 130 మంది పైగా ఓటర్లు ఉండటంతో ఇరువర్గాల్లో టెన్షన్ నెలకొంది.

## ఐఐహెచ్‌టీని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి.. కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ (సోమవారం) నాంపల్లిలో ఐఐహెచ్‌టీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ) వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఐఐహెచ్‌టీని ప్రారంభించడం సంతోషకరమని అన్నారు. తెలంగాణ విద్యార్థులు ఏపీ, ఒడిశా రాష్ట్రాలకు వెళ్లి హ్యాండ్లూమ్ కోర్సులు చదవాల్సి వస్తోందని అన్నారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో మాట్లాడి ఐఐహెచ్‌టీకి అనుమతులు తెచుకున్నామని ఈ సందర్భంగా వెల్లడించారు. విద్యార్థుల సమయం వృథా కాకూడదని, తెలుగు యూనివర్శిటీలో ఐఐహెచ్‌టీలో ఈ ఏడాది నుంచే తరగతులు ప్రారంభిస్తామని చెప్పారు. వచ్చే ఏడాది ఐఐహెచ్‌టీని స్కిల్ యూనివర్సిటీకి తరలిస్తామని చెప్పారు. ఒక్కో విద్యార్థికి నెలకు 2500 స్టై ఫండ్ ఇస్తామని హామీ ఇచ్చారు. "గతంలో సినీ తళుకు బెళుకులు కూడా చేనేతకి తెచ్చారు. కానీ నేతన్నల రాత మారలేదు. గతంలో సిరిసిల్లలో కార్మికులకు బకాయిలు పెట్టారు. ఆ మొత్తం మేము అధికారంలోకి వచ్చాక విడుదల చేశాం. బతుకమ్మ చీరలకు కట్టుకునే స్థాయిలో నాణ్యత లేవు. మంచి డిజైన్‌తో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలకు ఒక్కొక్కరి ఏడాదికి 2 చీరలు ఇస్తాం. బతుకమ్మ చీరలు ఆగిపోయాయని ఆలోంచాల్సిన అవసరం లేదు" అని రేవంత్ రెడ్డి అన్నారు. నేతన్నలకు రుణమాఫీ ఇస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రుణమాఫీకి ఇప్పుడే ఆదేశాలు ఇస్తున్నామని అన్నారు. " మీ సమస్యల పరిష్కారానికి మీ అన్నగా ఎప్పుడు ముందు ఉంటా.

కొడంగల్ నియోజక వర్గంలోని నేతన్నలతో నాకు మంచి సంబంధాలు ఉన్నాయి. నేతన్న కొండా లక్ష్మణ్ బాపూజీ వారసులు. త్యాగాలు చేస్తే ఎలా వేలాది కోట్ల ఆస్తులు సంపాదించారు. పదవిని తృణప్రాయంగా త్యాగం చేసింది కొండా లక్ష్మణ్ బాపూజీ" అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఐఐహెచ్‌టీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును పెట్టాలని అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు.

# పార్టీ మారిన ఎమ్మెల్యేలకు బిగ్ షాక్..

## అనర్హత పిటిషన్లపై నెల రోజుల్లో తేల్చండి

## తెలంగాణ స్పీకర్‌కు హైకోరు ఆదేశం




హైదరాబాద్ : తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యే అనర్హత పిటిషన్లపై హైకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. ఈ పిటిషన్లను అసెంబ్లీ స్పీకర్ ముందు ఉంచారని అసెంబ్లీ సెక్రటరీని ఆదేశించింది. నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకొని స్టేటస్ రిపోర్టు తెలియజేయాలని స్పీకర్ కార్యాలయ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. లేకుంటే తామే సుమోటోగా నిర్ణయం తీసుకుంటామని కూడా తేల్చి చెప్పింది.

**ముగ్గురిపైనే పిటిషన్ :** బీఆర్ఎస్ పార్టీ తరఫున కారు గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు పార్టీ మారారని వాళ్లపై అనర్హత వేటు వేయాలని ఈ మేరకు స్పీకర్కు ఆదేశాలు ఇవ్వాలని బీఆర్ఎస్ హైకోర్టులో పిటిషన్ వేసింది. పాడి కౌశిక్రెడ్డి, కేపీ వివేకానందతోపాటు బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్రెడ్డి ఈ పిటిషన్లు దాఖలు చేశారు. ఏప్రిల్లో దాఖలు చేసిన ఈ పటిషన్లపై ఆగస్టు ఏడో తేదీనే వాదనలు పూర్తి అయ్యాయి. అనంతరం తీర్పును రిజ్వర్ చేస్తున్నట్టు హైకోర్టు తెలిపింది. నెల రోజుల తర్వాత ఇవాళ(సోమవారం సెప్టెంబర్ 9న) తీర్పు వెల్లడించింది.

**స్పీకర్ పట్టించుకోలేదని వాదన :** ఒక పార్టీపై గెలిచిన ఎమ్మెల్యేలు అధికార పార్టీలో చేరడం సరికాదని వారిపై అనర్హత వేటు వేయాలని స్పీకర్కు ఫిర్యాదు చేశారు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు. అయితే స్పీకర్ నుంచి స్పందన రాకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. ఈవిషయంలో కాలయాపన జరుగుతుంటే కచ్చితంగా కోర్టులు జోక్యం చేసుకోవచ్చని పిటిషనర్ల తరఫున న్యాయవాదులు వాదించార. వివిధ రాష్ట్రాల్లో జరిగిన పరిణామాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను కూడా కోర్టు ముందు ఉంచారు. తాము మార్చిలోనే స్పీకర్కు ఈ ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేశామని వాదనల్లో తెలిపారు. దాదాపు ఐదు నెలలకుపైగా అయిపోయిందని వెల్లడించారు.

**ఉదహరణగా మణిపూర్ కేసు :** మణిపూర్ ఎమ్మెల్యేల కేసును కూడా పిటిషనర్ల తరఫున న్యాయవాదులు హైకోర్టుకు వివరించారు.

142 ఆర్టికల్ కింద సుప్రీంకోర్టు స్పీకర్కు నోటీసులు జారీ ఇచ్చిందని పేర్కొన్నారు. ఇక్కడ పార్టీ మారడమే కాకుండా మొన్న జరిగిన లోక్సభ ఎన్నికల్లో కూడా పోటీ చేశారని దానం నాగేందర్ ఇష్యూను కోర్టుకు వివరించారు పిటిషనర్లు.

**స్పీకర్ను ఆదేశించలేరన్న ప్రభుత్వం :** స్పీకర్ను ఆదేశిస్తే రెండు వ్యవస్థల మధ్య ఘర్షణపూరిత వాతావరణం ఏర్పడుతుందని ప్రభుత్వం తరుఫున న్యాయవాదులు వాదించారు. ఈ కేసులో అడ్వకేట్ జనరల్ సుదర్శన్రెడ్డి ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించారు. దానం, కడియం తరఫున శ్రీరఘురాం, మయూర్రెడ్డి, జంధ్యాల రవిశంకర్ కోర్టులో వాదించారు.

**నాలుగు వారాల గడువు :** పిటిషనర్ల తరఫున వాదను పరిగణలోకి తీసుకున్న హైకోర్టు గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను కూడా పరిగణలోకి తీసుకుంది.

నెల రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ను ఆదేశించింది. ఎప్పుడు నోటీసులు ఇస్తారు... ఎప్పుడు విచారణకు పిలుస్తారు. ఎప్పటి నుంచి వాదనలు వింటారు...

ఎప్పటి లోపు ప్రొసీడింగ్స్ పూర్తి చేస్తారో వివరంగా షెడ్యూల్ తెలియజేయాలని ఆదేశించింది హైకర్టు. నాలుగు వారాల్లో షెడ్యూల్ రిలీజ్ చేయకపోయినా నిర్ణయం ప్రకటించకున్నా తామే ఓ నిర్ణయం చెబుతామని పేర్కొంది హైకోర్టు.

# సంపాదకీయం

## జమ్మూనే నమ్ముకున్న బీజేపీ ?

బీజేపీ ఓటు బ్యాంక్ అంతా జమ్మూలోనే ఉంది. హిందుత్వ నినాదాలు కానీ బీజేపీ 370 ఆర్టికల్ రద్దు ప్రభావం కానీ జమ్మూలోనే ఎక్కువగా కనిపిస్తుంది. అక్కడ మెజారిటీ హిందువులు ఉంటారు. వారంతా బీజేపీ పట్ల సానుకూలంగా ఉంటారు. బీజేపీ గడచిన కొన్ని ఎన్నికల నుంచి జమ్మూలో బలం పెంచుకుంటోంది. కాశ్మీర్ లో అయితే ముస్లిం డామినేషన్ ఉంటుంది. సహజంగా అక్కడ చూస్తే నేషనల్ కాన్ఫరెన్స్ కే జనాలు ఓట్లు వేస్తారు. ఈసారి ఎన్నికల్లో చూస్తే జమ్మూలో 43 అసెంబ్లీ సీట్లకు కాశ్మీర్ లో 47 అసెంబ్లీ సీట్లకు ఎన్నికలు జరుగుతున్నాయి. అంటే మొత్తం 90 సీట్లకు అన్న మాట. ఈ తొంబై సీట్లకూ మెజారిటీ దక్కాలీ అంటే మ్యాజిక్ ఫిగర్ 46 రావాలీ. బీజేపీకి జమ్మూలో అత్యధిక సీట్లు దక్కినా కూడా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే పరిస్థితి ఉంటుందా అన్నదే చర్చగా ఉంది. ఒకవేళ జమ్మూలో బీజేపీ పాతిక నుంచి ముప్పయి సీట్లు తెచ్చుకున్నా మరో 16 సీట్లు కొరత పడతాయి. మరి అవి ఎలా సాధిస్తుంది అన్నది చూడాల్సి ఉంది. ఇక కాశ్మీర్ లో చూస్తే పండిట్లను ఇతర వర్గాల వారిని ముస్లిమేతరులను ఆకట్టుకోవడానికి బీజేపీ ఒకే జెండా ఒకే దేశం అని చెబుతోంది. అయితే అత్యధిక ఓట్లు అన్నీ పోలరైజ్ అయి నేషనల్ కాన్ఫరెన్స్ దానితో పొత్తు ఉన్న కాంగ్రెస్ కూటమికే పడతాయి. దాంతో బీజేపీ కాశ్మీర్ లో కొన్ని పాకెట్లలోనే పోటీ చేస్తూ మిగిలిన చోట్ల తమకు రేపటి రోజున అనుకూలంగా మారుతారు అనుకున్న వర్గాలకు ఇండిపెండెంట్లకు మద్దతు ఇచ్చేలా ప్లాన్ చేసుకున్ంటోనిద్. మరో వైపు చూస్తే వినాయక చవితి ముహూర్తంగా బీజేపీ మ్యానిఫెస్టోని హెూం మంత్రి అమిత్ షా కాశ్మీర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా విడుదల చేశారు. ఆయన నేషనల్ కాన్ఫరెన్స్ కాంగ్రెస్, పీడీఎఫ్ లను విమర్శించారు. ఆ మూడు పార్టీలూ అధికారంలోకి వస్తే ఉగ్రవాదులకు ఆశ్రయంగా కాశ్మీర్ మారుతుంది అని ఆయన హెచ్చరించారు. కాశ్మీర్ కి వేరే జెండా ఉండాలని ఆ పార్టీలు కోరుకుంటున్నాయని ఆయన దుయ్యబెట్టారు. అదే బీజేపీ అయితే ఒకే దేశంగా ఉంచుతూ కాశ్మీర్ ని అంతర్భాగం చేస్తూ అక్కడ అభివృద్ధికి పాటు పడుతుందని చెప్పుకొచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే కాశ్మీర్ కి రాష్ట్ర హెూదా ఇస్తుందని ఆయన చెప్పారు. ఇక్కడే ఒక ట్విస్ట్ ఉంది. ఒక వేళ బీజేపీ గెలవకపోతే కేంద్ర పాలిత ప్రాంతంగానే జమ్మూ కాశ్మీర్ లను ఉంచుతుందా అన్న చర్చ నడుస్తోంది. అంతే కాదు ఆ విధంగా చేసినట్లు అయితే ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా బీజేపీ కేంద్ర ఆధిపత్యం అలాగే ఉంటుంది. మొత్తానికి చూస్తే బీజేపీ బహుముఖమైన ప్రణాళికలతో కాశ్మీర్ ఎన్నికలను ఎదుర్కోబోతోంది.

## ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించండి... మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్...



జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) ప్రజావాణిలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టురు మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను జాప్యం లేకుండా పరిష్కరించాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో 89 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ హరిప్రియ, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రస్థాయిలో హైదరాబాదులోని మహాత్మ జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించే ప్రజా వాణి కార్యక్రమం వాయిదా వేసి బుధవారం, అనగా ఈ నెల 10న జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమం 11వ తేదిన జరుగుతుందని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం తెలిపారు. మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా ప్రజలు ఏవైనా అర్జీలు ఇచ్చేవారు ఇట్టి మార్పును గమనించి మంగళవారానికి బదులుగా బుధవారం వెళ్లాలని కలెక్టర్ సూచించారు.

## ముసుగేసిన వ్యాపారాలు



వేములవాడ : నాలుగు రోజులుగా పడుతున్న వర్షం కారణంగా ఆధ్యాత్మిక క్షేత్రమైన వేములవాడలోని చిరు వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. వ్యాపారం సాగక దుకాణా లకు ముసుగేశారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కావడంతో శ్రీరాజరాజేశ్వ రస్వామి దర్శనానికి రోజూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వేల సంఖ్యలో వస్తుంటారు. అనుబంధ ఆలయాలైన బద్ది పోచమ్మకు బోనాల మొక్కులు చెల్లించుకుంటారు. ఆషాఢం కావడంతో భక్తుల రాక బాగా తగ్గిపోయింది. పైగా నాలుగు రోజులుగా ముసురు కారణంగా పట్టణంలోని రహదారుల్లో జన సంచారం అంతంత మాత్రంగానే ఉండటంతో వెలవెలబోతున్నాయి. పట్టణంలోని ఆలయ పరిసర వీధులు ఇతర రోజుల్లో భక్తులు, స్థానికులతో కిక్కిరిసిపోయి నడవడానికి ఇబ్బందులు పడాల్సి వచ్చేది. అలాంటిది ప్రస్తుతం నిర్మానుష్యంగా మారాయి. ఎటువైపు చూసినా దుకాణాలకు కవర్లు కప్పి దర్శనమిస్తున్నాయి. ప్రధాన ఆలయ పరిసరాల్లోని రోడ్ల వెంబడి వ్యాపారులు దుకాణాలను మూసివేశారు. వీధి వ్యాపారులు గిరాకీ లేక తోపుడు బండ్లకు కవర్లు కప్పి మూసేశారు. ఆలయ పరిసరాల్లోని దాదాపు వేయి మందికిపైగా వీధి వ్యాపారులు, మరో రెండు వేల మందికి పైగా దుకాణదారులు ఉంటారు. పొట్టకూటి కోసం కొందరు వీధి వ్యాపారులు దుకాణాలను తెరుచుకొని గిరాకీ కోసం ఎదురుచూస్తున్నారు.

**తీర్థయాత్రలకు...**

పట్టణంలోని చాలా దుకాణాల నిర్వాహకులు తీర్థయాత్రలకు వెళ్లారు. ఆషాఢం కావడంతో స్వామివారి దర్శనానికి భక్తులు రాకపోవడంతో ఆలయ పరిసరాల్లోని వ్యాపారులు వివిధ ప్రాంతాలకు తీర్థయాత్రలకు వెళ్లారు. ఆలయ పరిసరాల్లో చాలా వరకు బొమ్మలు, ఆట వస్తువులు, బెల్లం, కొబ్బరికాయలు, పూలు, పూజా సామగ్రి వంటివి విక్రయిస్తుంటారు. శ్రావణ మాసం వస్తే తప్ప వ్యాపారాలు పూర్తి స్థాయిలో జరిగే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో చిన్న, చిన్న వ్యాపారులు దుకాణాలను మూసేసి తీర్థయాత్రలకు వెళ్లారు. ప్రస్తుతం వ్యాపారాలు నామమాత్రంగా కొనసాగుతున్నాయి. గతంలో ఒక్కో వ్యాపారి రోజుకు రూ. 2 వేలకు పైగా విక్రయిస్తే, ప్రస్తుతం సెన్‌ఫోన్లు చూసుకుంటూ కూర్చుంటున్నారు. వీధి వ్యాపారులు సైతం రోజుకు రూ. 100 కూడా గిరాకీ కావడం లేదని వాపోతున్నారు.

**గిరాకీ లేదు**

నాలుగు రోజుల నుంచి వానతోపాటు ఆషాఢం కావడంతో వ్యాపారం జరగడం లేదు. అంతకు ముందు రోజుకు రూ.వేయి నుంచి రూ. 1,500 వరకు అమ్మకాలు జరిగేవి. ప్రస్తుతం రోజుకు కనీసం రూ. 100 కూడా అమ్మడం లేదు. ఇంటి దగ్గర పని లేక వర్షంలోనూ దుకాణం నడిపిస్తున్నా. – లావణ్య, రాజన్న ఆలయ రోడ్డు

**ఈ నెలంతా నష్టమే**

ఓవైపు ఆషాఢం, మరోవైపు వాన కారణంగా గిరాకీ లేదు. ఆషాఢం నుంచి గిరాకీ పూర్తిగా తగ్గిపోయింది. ప్రస్తుతం రోజుకు రూ. 200 కూడా రావడం లేదు. ఈ నెలలో షట్టరు కిరాయి జేబులో నుంచి భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దుకాణం తెరిచి కూర్చోవడమే తప్ప వ్యాపారం ఏమీ లేదు.
– ఆడెపు శ్రీనివాస్, బద్దిపోచమ్మ వీధి

## జనన ధ్రువపత్రాలకు అగచాట్లు



జగిత్యాల : పురపాలక కార్యాలయంలో జనన, మరణ ధ్రువపత్రాల జారీ నెల రోజులుగా నిలిచిపోవడంతో దరఖాస్తులు పేరుకుపోయాయి. ఫలితంగా దరఖాస్తుదారులు కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. గత 15 రోజుల్లో 600 జనన ధ్రువీకరణ దరఖాస్తులు అపరిష్కృతంగా మారాయి. కమిషనర్ అనిల్ పోలీసు కేసులో పరారీలో ఉండగా తరువాత ఇన్‌ఛార్జులుగా ఇద్దరు బాధ్యతలు చేపట్టడంతో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీకి నోచుకోలేక పోయాయి. తాజాగా పది రోజుల కిందట నూతన కమిషనర్‌గా సమ్మయ్య బాధ్యతలు చేపట్టినప్పటికీ ఇతరత్రా పనుల కారణంగా పూర్తిస్థాయిలో ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలేదు. ప్రతిరోజూ 80కి మించి ధ్రువీకరణ పత్రాలు జారీ చేయలేకపోవడంతో 500 దరఖాస్తులు నిలిచిపోయాయి.

**దరఖాస్తుదారుల ఇబ్బందులు..**

నిబంధనల మేరకు జనన, ధ్రువీకరణ పత్రాలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వారం రోజుల్లోపు అందజేయాల్సి ఉంది. గత 3 నెలలుగా బల్దియాలో పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతోపాటు అధికారుల నిర్లక్ష్యం కారణంగా దరఖాస్తులు అపరిష్కృతంగా ఉన్నాయి. ఆధార్, విద్య, బీమా తదితర అన్ని అవసరాలకు జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి కావడంతో తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి నిరీక్షించాల్సి వస్తోందని వాపోతున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి జగిత్యాల ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో జన్మించిన పిల్లల జనన ధ్రువీకరణ పత్రాలు స్థానిక పురపాలక కార్యాలయమే జారీ చేయాల్సి ఉంటుంది. సకాలంలో ధ్రువీకరణ పత్రాలు లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని పలువురు దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మరణ ధ్రువీకరణ పత్రాలు నేరుగా బల్దియా కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది. వీటిపైనా అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు.

**ఆసుపత్రుల నిర్లక్ష్యం..**

ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు తమవద్ద జన్మించిన శిశువుల వివరాలు ప్రతినెలా బల్దియాకు అందజేయాల్సి ఉంటుంది. వీటి ఆధారంగానే బల్దియా జనన ధ్రువీకరణ పత్రాలు అందజేస్తోంది. స్థానిక సాధారణ ఆసుపత్రి సిబ్బంది కొన్ని నెలలుగా శిశువుల వివరాలు బల్దియాకు అందజేయకపోవడంతో ధ్రువీకరణ పత్రాల కోసం తల్లిదండ్రులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ప్రధానంగా 2023కు ముందు వివరాలు సాధారణ ఆసుపత్రి నుంచి ఇప్పటి వరకూ బల్దియాకు చేరవేయకపోవడం గమనార్హం. ఈ సమయంలో పుట్టిన శిశువుల ధ్రువీకరణ పత్రాలు ఆన్‌లైన్‌లో లభ్యం కాకపోవడంతో సాధారణ ఆసుపత్రి నుంచి మాన్యువల్‌గా వివరాలు కావాలని బల్దియా కోరుతోంది. ఈ క్రమంలో వివరాల కోసం దరఖాస్తుదారులు సాధారణ ఆసుపత్రికి వెళ్తే ఈ విభాగం ఇక్కడి నుంచి మాతాశిశు కేంద్రానికి తరలించారని చెబుతున్నారు. దరఖాస్తుదారులు ఎంసీహెచ్‌లో ఉన్న నాలుగో అంతస్తుకు వెళ్లి వాకబు చేస్తే ఆధార్, ఇతర జిరాక్స్‌ల కోసం తిప్పి పంపడంతో ప్రయాస పడాల్సి వస్తోంది. దరఖాస్తుదారుల కోసం ప్రత్యేక కౌంటరు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

## గురుకుల కళాశాలలో కాళోజి జయంతి వేడుకలు


శామీర్ పేట, (గరుడ వార్త) : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం షామీర్పేట లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో కాళోజి జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సమావేశంలో తెలంగాణ భాష గొప్పతనాన్ని, కాళోజీ నారాయణ



రావు చేసిన కృషిని విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు తెలంగాణ భాష, యాసల గొప్పతనాన్ని తెలుపుతూ పాటలు, ఉపన్యాసాలు, నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. చేతన, తెలుగు అధ్యాపకులు డా. వి. హర్షిత, వి. మేఘ స్రవంతి, జి. ధనవేని, అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మల్లారెడ్డి జన్మదినం పురస్కరించుకొని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన...తాళ్ల జగదీష్ గౌడ్.

శామీర్ పేట, (గరుడ వార్త) : ఎమ్మెల్యే మల్లారెడ్డి జన్మదినం సందర్భంగా శివాలయంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తాళ్ల జగదీష్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం అలియాబాద్ కు చెందిన తాళ్ల జగదీష్ గౌడ్ శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలోని శివాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అలియాబాద్ పరిధిలోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలోని శివాలయం లో మల్లారెడ్డి నూరేళ్లు అష్టైశ్వర్యాలతో



తులతూగాలని స్వామివారికి ప్రత్యేక పూజలను జగదీష్ గౌడ్ జరిపారు. అలాగే మేడ్చల్ నియోజకవర్గం శాసనసభ్యులు మల్లారెడ్డి జన్మదినం సందర్భంగా తిరుపతి వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని తిరిగి వచ్చిన మల్లారెడ్డిని హైదరాబాద్ విమానాశ్రయంలో స్వాగతం పలికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, నాయకులు వంగ వెంకట్ రెడ్డి, లాలయ్య, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## వాడ వాడలో పూజలు అందుకుంటున్న గణపయ్య

శామీర్ పేట, (గరుడ వార్త) : సోమవారం పూర్వ ఉమ్మడి శామీర్ పేట మండలం లోని వివిధ గ్రామాలలో బొజ్జ గణపయ్యను ఏర్పాటు చేసి ఎంతో భక్తిశ్రద్ధలతో కొలుస్తున్నారు. ఇందులో భాగంగా తుంకుంట మున్సిపల్ పరిధిలోని హకీంపేట లోని న్యూ కాలనీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయకున్ని ఏర్పాటు చేశారు. ఆ మండపం వద్ద యూత్ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేయగా మున్సిపల్



కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి పాల్గొని గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట ఫ్రెండ్స్ కాలనీలో ఏర్పాటుచేసిన గణనాథునికి యువకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ప్రతి రోజూ నీటి సరఫరా ఎప్పుడో?

కరీంనగర్ : రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా మూడేళ్ల కిందట నగరానికి ప్రతిరోజూ నీటి సరఫరా చేశారు. ఈ ఏడాది వేసవిలో దిగువ మానేరు జలాశయంలో నీటి నిల్వలు పడిపోవడంతో రోజు విడిచి రోజు నీటి సరఫరా ప్రారంభించారు. ప్రస్తుతం పుష్కలమైన నీటితో జలకళ ఉన్నప్పటికి అధికారులు మాత్రం ఆ దిశగా అడుగు ముందుకు వేయడం లేదు.

వర్షాకాలంలోనూ కష్టాలే..కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో వర్షాకాలం వచ్చినా తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ప్రతిరోజు నీటి సరఫరాకు అలవాటు పడిన నగరవాసులు.. డ్యాంలో నీటిమట్టం పెరిగినప్పటికీ రోజు నీటి సరఫరా వైపు ఆలోచన చేయడం లేదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు భూగర్భ జలాలు పెరగడంతో నీటి అవసరాలు తగ్గాయి. బోరు బావులు ఉన్న ఇళ్లల్లో బోరు నీటినే వాడుతున్నారు. నల్లా నీటిపైనే ఆధార పడిన వారికి రోజూ నీటి సరఫరా చేస్తే ఇబ్బందులు దూరమయ్యే అవకాశముంది.

పది టీఎంసీలు అవసరం

గత ప్రభుత్వ హయాంలో దిగువ మానేరు జలాశయంలో పది టీఎంసీల నీరు నిల్వ ఉండేలా చర్యలు చేపట్టారు. డ్యాంలో నీటిమట్టం ఆ మేర ఉంటే రోజు నీటి సరఫరాకు ఎలాంటి ఆటంకాలు ఉండవు. నేరుగా నీటిని పంపింగ్ చేసుకొని శుద్ధి చేసుకునే వీలుంటుంది. రోజూ నీటి సరఫరా ప్రారంభించినప్పటి నుంచి మొదటిసారి ఈ వేసవిలో రోజు



విడిచి రోజు నీటిని సరఫరా చేశారు. దీనికి ప్రధాన కారణం నిల్వ ఉన్న నీరంతా దిగువకు వదలడంతో ఎల్ఎండీలో అయిదు టీఎంసీల నీరే నిల్వ ఉంది. ఆ నీటిని పంపింగ్ చేసుకోవడం ఇబ్బందికరంగా మారింది. దాంతో నీరందకపోవడంతో నీటి సరఫరాలో మార్పులు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి దిగువ మానేరులో పది టీఎంసీల నీటిని తాగునీటి అవసరాల కోసం నిల్వ ఉంచాల్సిన అవసరముందని నగర ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని కమిషనర్, ఎస్ఈల దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని నగరపాలిక డీఈఈ లచ్చిరెడ్డి పేర్కొన్నారు.

సాంకేతిక సమస్యలపై పట్టింపేది?

నీటి శుద్ధి కేంద్రంలో సాంకేతిక సమస్యలు పరిష్కారం కాలేదు.

మిషన్ భగీరథ శుద్ధి కేంద్రంలో 370 హెచ్‌పీ మోటార్లు చెడిపోగా, ఇప్పటికీ మరమ్మతులు చేయలేదు.

ఇక్కడ చిన్న, చిన్న సమస్యలను అలాగే వదిలేశారు.

34 ఎంఎల్‌డీల ఫిల్టర్ బెడ్‌లో జనరేటర్‌కు ప్యానల్ బోర్డు బిగించలేదు. విద్యుత్తు సరఫరా నిలిచిపోతే నీటి సరఫరాలో అంతరాయం తప్పదు.

# హైడ్రా పేరుతో వసూళ్లు

హైదరాబాద్: హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) పేరుతో కొందరు వసూళ్లకు పాల్పడుతున్నారు. అమాయకులను లక్ష్యంగా చేసుకుని నోటీసులు, కూల్చివేతలంటూ బెదిరిస్తున్నారు. దీనికి సంబంధించి రోజూ ఐదు నుంచి పది మంది తమ కార్యాలయాన్ని సంప్రదిస్తున్నట్టు హైడ్రా అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ సంస్థ నగర భవిష్యత్తు కోసం చెరువులు, నాలాల ఆక్రమణలను తొలగిస్తుంటే.. కొందరు అవినీతిపరులు సంస్థ పేరును దుర్వినియోగం చేస్తున్నారని హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరైనా హైడ్రా పేరు చెప్పి వసూళ్లకు పాల్పడినా, నోటీసులిచ్చి కూల్చివేస్తామని బెదిరించినా సంబంధిత ఠాణా,. జిల్లా ఎస్పీ కార్యాలయం, సీపీ ఆఫీసులో లేదా హైడ్రా కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని రంగనాథ్ పిలుపునిచ్చారు. అమీన్‌పూర్‌కు చెందిన డా.విప్లవ్‌పై కేసు నమోదు చేయించామని, మరికొందరిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు.అధికారులతో దిగిన ఫొటోలు చూపి..

హైడ్రా ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 200 ఆక్రమణలు తొలగించారు. అదనుగా కొందరు కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. ఆక్రమిత స్థలంలో భవన నిర్మిస్తున్నారని హైడ్రాకు ఫిర్యాదు చేసి కూలగొట్టిస్తామని



బెదిరిస్తున్నారు. హైడ్రా అధికారులతో దిగిన ఫొటోలను చూపించి మాయ చేస్తున్నారు.

కాలనీల్లో తిరుగుతూ ఇది ఎఫ్‌టీఎల్‌లో ఉందని, ఇది బఫర్ జోన్‌లో ఉందని కేటుగాళ్లు స్థానికులను భయపెడుతున్నారు. ఇదేంటని అడిగితే.. మేం హైడ్రా తరఫున వచ్చామని, అధికారులే తమను పంపారంటూ అబద్ధం చెబుతున్నారు. కూల్చివేతల నుంచి మీ కాలనీకి, ఆక్రమణలకు మినహాయింపు ఇప్పిస్తామంటూ మోసం చేస్తున్నారు. అపార్ట్‌మెంట్లు నిర్మించే వారి నుంచి అంతస్తుకు రూ.లక్ష అడుగుతన్నారు. ఆక్రమణలపై హైడ్రా వివరాలు కోరుతోందంటూ.. కొందరు రెవెన్యూ అధికారులు నగరవ్యాప్తంగా ఇప్పటికే వెయ్యికిపైగా నోటీసులిచ్చారు. చెరువుల్లోని ప్రతి ఇంటికి తాఖీదులు పంపిస్తున్నారు. వాటిని చూసి పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. సామాజిక కార్యకర్తనంటూ..సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌కు చెందిన డా.విప్లవ్ సామాజిక కార్యకర్త ముసుగులో స్థానిక బిల్డర్‌ను డబ్బు అడిగారు. లేదంటే హైడ్రాకు ఫిర్యాదు చేస్తా అన్నారు. ఆయన వేధింపులు భరించలేకపోతున్నా అంటూ బాధిత నిర్మాణదారు గత హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. ఆ విషయాన్ని రంగనాథ్ జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పోలీసులను ఫిర్యాదు తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక పోలీసులు డా.విప్లవ్‌పై కేసు నమోదు చేసారు. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# ప్రతి ఇంట్లో వెలుగులు నింపాలని..!



భానుపురి : ఉమ్మడి నల్గొండ జిల్లాలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు తక్కువ ధరకే విద్యుత్తు మీటర్ ఇవ్వనున్నారు. రూ.825కే కనెక్షన్ ఇచ్చేందుకు రాష్ట్ర విద్యుత్తు శాఖ చర్యలు తీసుకుంటోంది. ఈ నెల 15 వరకు విద్యుత్తు అధికారులు గ్రామాల్లో నేరుగా దరఖాస్తులు తీసుకొనేందుకు కసరత్తు ప్రారంభించారు. గృహ విద్యుత్తు కనెక్షన్ కావాలంటే మీ–సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. లోడ్ ఆధారంగా నగదు దరఖాస్తు ఫీజులు చెల్లించాల్సి వచ్చేది. కానీ బీపీఎల్ కుటుంబాల వారు విద్యుత్తు కార్యాలయాలు, ఉపకేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే చాలు వారికి విద్యుత్తు మీటరు మంజూరు చేయనున్నారు.

**గృహజ్యోతి ఫలాలు అందించేందుకు..**

ఉమ్మడి నల్గొండ జిల్లాలో కొంతమంది ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు విద్యుత్తు మీటర్లు లేవు. దీని కారణంగా గృహజ్యోతి పథకం అందడం లేదు. మీటర్లు పొందే ఆర్థిక స్తోమత లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకం కింద ఉచితంగా విద్యుత్తు అందించేందుకు పూనుకుంది. దీంతో తక్కువ ధరకే వీరికి మీటర్లు అందించేందుకు చర్యలు తీసుకుంటుంది. ఈ నెల 17 నుంచి 10 రోజులపాటు ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈనెల 15 వరకు విద్యుత్తు మీటర్లకు దరఖాస్తు చేసుకొంటే తర్వాత గృహజ్యోతి పథకం పొందే అవకాశం ఉంటుంది. మీటర్లకు దరఖాస్తు చేసుకున్న వారికే అదే నెల నుంచి సున్నా బిల్లు రానుంది.

**ప్రభుత్వ ఆదేశాల మేరకు..**

–డి.ఫ్రాంక్లిన్, విద్యుత్తు శాఖ ఎస్ఈ, సూర్యాపేట

జిల్లాలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు మీటరు అందించేందుకు చర్యలు తీసుకుంటాం. సిబ్బందితో ఇంటింటికి వెళ్లి దరఖాస్తులు తీసుకొనేలా చూస్తాం. ప్రతి ఒక్కరికీ మీటరు అందించేందుకు ప్రభుత్వ ఆదేశాలు అమలు చేస్తాం.

ఇలా అవకాశంఎస్సీ, ఎస్టీ కుటుంబాల్లో రెండు ఫ్యాన్లు, రెండు ట్యూబ్‌లైట్లు, బ్లాక్ అండ్‌వైట్ టీవీ ఉన్నవారికే అవకాశం ఉంటుంది. ఎస్టీ, ఎస్సీ కాలనీల్లోనే అధికంగా బీపీఎల్ కుటుంబాలు ఉన్నాయి. వీరిలో చాలా మంది గృహజ్యోతి పథకం ఫలాలు పొందటం లేదు. వీరికి రూ.825కే విద్యుత్తు మీటరు ఇవ్వనున్నారు. ఎస్సీ, ఎస్టీ, కాలనీల్లోనే కాకుండా గ్రామాల్లో, తండాల్లో బీపీఎల్ కుటుంబాల వారు ఉంటే విద్యుత్తు మీటర్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

# పోషకాహారంతో ఆరోగ్యపుష్టి



సిరిసిల్ల : చిన్నారుల్లో శారీరక ఎదుగుదలలో లోపాలను నివారించేందుకు అంగన్‌వాడీలు సేవలందిస్తున్నాయి. తల్లితోపాటు బిడ్డకు పోషక విలువలను అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నాయి. అయినప్పటికీ ఇంట్లో తీసుకునే ఆహారం విషయంలో అవగాహన కొరవడుతుంది. ఇలాంటి పరిస్థితులకు స్వస్తి పలికేందుకు 'పోషణ మాసం' నిర్వహించి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నారు. నెల రోజుల పాటు వివిధ కార్యక్రమాలతో లబ్ధిదారులను చైతన్యం చేయనున్నారు.జిల్లాలో వేములవాడ, సిరిసిల్ల ఐసీడీఎస్ ప్రాజెక్టుల ఆధ్వర్యంలో 43 వేల మంది లబ్ధిదారులు ఉన్నారు. గిరిజన, మారుమూల గ్రామాలతోపాటు పట్టణాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నారు.

కోడి గుడ్డుతోపాటు నిర్దేశిత మెనూ ప్రకారం ఒక పూట భోజనాన్ని అందిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోషకలోపాన్ని నివారించేందుకు కృషి చేస్తున్నప్పటికీ లబ్ధిదారులు ఇంట్లో వండుకునే ఆహారంలో పోషక విలువలను పాటించకపోవడంతో ఆశించిన మేర ఫలితాలు రావడం లేదు. దీన్ని అధిగమించేందుకు ప్రతి సంవత్సరం సెప్టెంబర్‌లో 'పోషణ మాసం' కార్యక్రమం ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

కార్యక్రమాలు ఇలా...

ప్రభుత్వ పాఠశాలలు, స్థానిక సంస్థలు, వివిధ శాఖలను భాగస్వామ్యం చేస్తూ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా అయిదు వారాలపాటు ప్రజలు, లబ్ధిదారులతో మమేకమై పోషకాహార ప్రాధాన్యత, రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తారు.

చిన్నారుల్లో ఎదుగుదలను పరీక్షించి పోషణ్ ట్రాకర్‌లో నిక్షిప్తం చేశారు. 'పోషణ్ బి... పడాయ్ బి'లో భాగంగా పిల్లలకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహిస్తారు.

శిశువు పుట్టిన క్షణం నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తారు. అనుబంధ ఆహారంపై అవగాహన పెంపొందిస్తారు.

పోషణ్ బీ... పడాయి బీతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత, కాలానుగుణ వ్యాధులకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచిస్తారు. పోషక లోపంతో వచ్చే వ్యాధులు, శిశువుల బరువు ఆవశ్యకతను వివరిస్తారు.పర్యావరణం, నూతన సాంకేతిక వినియోగం తదితర అంశాలను ఇందులో చేరుస్తారు. తల్లి పేరుతో ఓ మొక్కను నాటే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు

పోషకాహారంతో కలిగే ప్రయోజనాలను విస్తృతంగా ప్రచారం చేస్తాం. నెలలో ఐదు వారాల పాటు వివిధ కార్యక్రమాలతో ముందుకు వెళ్తాం. ప్రధానంగా ఇంటి పరిసరాల్లో లభించే ఆకుకూరలు, కూరగాయలు, సీజనల్ పండ్లతో ఎక్కువ పోషకాలు లభిస్తాయి. ఖర్చు తక్కువ ఉంటుంది. ఏడు రంగుల్లో లభించే పండ్లు, కూరగాయలతో కలిగే ప్రయోజనాలు చెబుతాం. శిశువు ఎదుగుదల, బరువు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తల్లిదండ్రులకు వివరిస్తాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే ఆహారంతోపాటు ఇంటి వద్ద పెట్టాల్సిన భోజనంపై అవగాహన కల్పిస్తాం.లక్ష్మీరాజం, జిల్లా సంక్షేమాధికారి

# వారే వీరు.. బిల్లులే వేర్వేరు

హైదరాబాద్: జీహెచ్ఎంసీ పరిధిలో నాలాల్లో పూడికతీత, రోడ్లపై వ్యర్థాల తొలగింపు, నీటిని దారి మళ్లించే పనులు నిధుల మేతగా తయారయ్యాయి. ఇంజినీర్లు, కాంట్రాక్టర్లు కుమ్మక్కవ్వడంతో ప్రజాధనం దుర్వినియోగమవుతోంది.

వేర్వేరు బిల్లులు..జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఏడాది పొడవునా పూడికతీత పనులు జరుగుతుంటాయి. ఈ పనులు చేపట్టే కాంట్రాక్టర్లకే ఇంజినీర్లు 90శాతం పనులు అప్పగించారు. అదే సమస్యకు ప్రధాన కారణమైంది. క్షేత్రస్థాయిలో పనిచేసే పలువురు సహాయ ఇంజినీర్లు, కార్యనిర్వాహక ఇంజినీర్లు గుత్తేదారులతో చేతులు కలిపి అవకతవకలకు తెరలేపారు. పూడికతీత పనులకు ఉపయోగించే కార్మికులు, వాహనాలకు ఎంఈటీ ఫ్లెక్సీని కూడా తగిలించారు. దాంతో ఒకే వాహనం, అందులోని కార్మికులే ద్విపాత్రాభినయం చేస్తున్నట్లయింది. ఇంజినీర్లు మాత్రం రెండింటికీ వేర్వేరుగా బిల్లులు పెడుతుండడం గమనార్హం. పూడికతీత, ఎంఈటీ పనులకు ఒకే బృందం పని చేయడంతో ఏ పని కూడా సరిగ్గా జరగట్లేదనే విమర్శలొస్తున్నాయి.

24 గంటలు ఉండేదెక్కడ..

అత్యవసర బృందాలు రోజుకు మూడు షిఫ్టుల్లో వారికి కేటాయించిన ప్రాంతాల్లో సేవలందించాలి. ఆయా నిబంధనలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఒకే బృందం పగటిపూట రెండు రకాల పనుల్లో కనిపిస్తోందని, రాత్రిళ్లు చాలా చోట్ల ఈ బృందాలు ఉండట్లేదనే



విమర్శలున్నాయి.

నకిలీ రసీదులతో..

నాలాల్లో పూడికను తొలగించకుండానే కొందరు గుత్తేదారులు బిల్లులు పెడుతున్నారు. జవహర్‌నగర్ డంపింగ్‌యార్డుకు తరలించినట్లుగా నకిలీ రసీదులను పెడుతున్నారని, ప్రైవేటు చెత్త లారీలకు డంపింగ్ యార్డు ఇచ్చే రసీదులను బిల్లుల్లో చూపుతున్నారు.

# అక్రమ ప్రకటనలపైనా గురి

హైదరాబాద్: చెరువులు, నాలాలు, పార్కులు, లేఅవుట్ ఖాళీ స్థలాల్లోని ఆక్రమణలను నేలమట్టం చేస్తున్న హైడ్రా ఇప్పుడు నగరంలోని అక్రమ ప్రకటనలపై దృష్టి సారించింది. నగరంలో వేలాదిగా ఉన్న అనుమతి లేని ప్రకటన బోర్డులను తొలగించేందుకు సిద్ధమైంది. హిమయత్‌నగర్ ప్రధాన రహదారి విభాగినిపై ఏర్పాటు చేసిన ప్రకటన బోర్డులను సిబ్బంది తొలగించారు. నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి చిత్రాలతో ఏర్పాటైన ఆయా ప్రకటనలకు అనుమతి లేదని, జీహెచ్ఎంసీ ఆదాయానికి గండి కొడుతూ ప్రకటన సంస్థలు ఏర్పాటు చేసిన బోర్డులన్నింటినీ తీసేస్తున్నామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు.

కమిషన్ దృష్టి: నగరంలో పలు ప్రకటన బోర్డులు అనుమతి లేకుండా కొనసాగుతున్నాయి. బస్టాపులు, నిర్వహణ లేని ఏసీ బస్టాపులపై



వందకుపైగా అక్రమ బోర్డులు ఉన్నాయి. ట్రాఫిక్ కూడళ్లలో దాదాపు 700 అనుమతి లేని ట్రాఫిక్ అంబ్రెల్లాలు కొనసాగుతున్నాయి. కోర్టు స్టే పేరుతో ఓ ప్రకటన సంస్థ ఐమాక్స్ రోడ్డు, జూబ్లీహిల్స్ రోడ్డులో లాలీపప్ ప్రకటనలు, సైబర్‌టవర్స్, బయోడైవర్సిటీ, తెలుగుతల్లి కూడళ్లలోని పైవంతెన్లపై భారీ బోర్డులు ఏర్పాటు చేసి, ఏళ్లుగా వ్యాపారం చేస్తోంది. ఇటీవల ఏర్పాటైన హైడ్రాకు అక్రమ ప్రకటనలపై ఫిర్యాదులు వరసకట్టాయి. వాటిపై రంగనాథ్ దృష్టి పెట్టారు.

# జల గలగలలు లేని..కనగల్

కనగల్: గత వారం రోజులుగా విస్తారంగా.. కుండపోత వర్షం కురిసి జిల్లాలోని పలు ప్రాంతాలు జలమయమై, నీటి ఒత్తిడికి చెరువులకు, కాలువలకు గండ్లు పడి అల్లకల్లోల పరిస్థితులుంటే.. కనగల్ మండల పరిధిలో మాత్రం వేరుగా ఉంది. ఈ ప్రాంతంలోనే పెద్దదైన కనగల్ మైల సముద్రం చెరువులోకి పావు వంతుకూడా నీరు చేరలేదు. పూర్తిస్థాయి నీటి మట్టం 18 అడుగులు కాగా.. ప్రస్తుతం 9 అడుగులకు చేరింది. ఇందులో మూడు అడుగుల మేర పూడిక పేరుకపోయింది. దర్వేశిపురం చెరువులోకి ఇటు ఏఎమ్మార్పీ నీరు, వరద నీరు చేరకపోవడంతో అందులో చుక్క నీరు లేదు. మండల వ్యాప్తంగా 78



చెరువులు, కుంటలు ఉంటే జి.యడవల్లి ఉత్తర, దక్షణం, మంచినీళ్లబావి తుంగకుంటతో పాటు మరో రెండు మూడు చెరువులు వర్షంతో పాటు ఏఎమ్మార్పీ నీరు చేరడంతో అలుగులు పోస్తున్నాయి. లచ్చుగూడెం, అమ్మగూడెం, తిమ్మాజీగూడెంలోని చెరువులకు 40 శాతం మాత్రమే నీరు చేరింది. పెద్ద చెరువులైన చిన్నమాదారం, బొమ్మపల్లి చెరువులోకి కూడా సగం నీరు చేరలేదు. దర్వేశిపురం చెరువులోకి ఏఎమ్మార్పీ నీరు మళ్లించే అవకాశం ఉన్నా.. ఎవరూ పట్టించుకోకపోవడంతో అందులోకి నీరు చేరడం లేదు. మండలంలో జూన్ 1 నుంచి ఆగస్టు 31 వరకు 289 మి.మీ, సెప్టెంబరులో 20.9 మి,మీ వర్ష పాతం నమోదైయింది. ఇక్కడ సాధారణ వర్షపాతం కూడా గగనమే.

# అంతరాయాలు అరికట్టి.. సత్వర సేవలపై దృష్టి

నిర్మల్ : విద్యుత్తు వినియోగదారులకు నాణ్యమైన నిరంతర సరఫరా, సేవలను మరింత మెరుగుపర్చేందుకు ఉత్తర విద్యుత్తు పంపిణీ మండలి పలు కార్యక్రమాలు చేపడుతోంది. తాజాగా విద్యుత్తు సరఫరాలో అంతరాయాలను కనిష్ఠ స్థాయికి తగ్గించేందుకు సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటికే ప్రజావాణి, వినియోగదారుల రిసెప్షన్ డెస్క్, ఉద్యోగులు, సిబ్బందిలో నిబద్ధత, అధిక లోడ్‌ను అధిగమించేందుకు ఉపకేంద్రాల్లో కెపాసిటర్ బ్యాంకులు, తదితర చర్యలు చేపట్టింది.

కొత్త పరికరాల పనితీరు ఇలా..

ఉపకేంద్రాల్లో అంతరాయాలను గుర్తించేందుకు సైదీ, సైఫీ రెండు పరికరాలు అమర్చారు. ప్రయోగాత్మకంగా జిల్లా కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో వీటిని ఏర్పాటు చేశారు. విద్యుత్తు సరఫరాలో ఎన్నిసార్లు, ఎంతెంత సమయం అంతరాయాలు ఏర్పడ్డాయి.. తదితర వివరాలు అందులో నిక్షిప్తం అవుతాయి. ఇందుకోసం ప్రత్యేకంగా ఫీడర్‌లో, ఉపకేంద్రం కార్యాలయంలో పరికరాలు ఏర్పాటు చేశారు. ఇటీవల వీటిని అమర్చి అంతరాయాలను కనిష్ఠ స్థాయికి చేర్చి నిరంతర సరఫరా అందిస్తున్నట్లు డిస్కం నిర్మల్ ఎస్ఈ బి.శ్రీనివాస్ చెప్పారు.

స్తంభాలకు నంబర్లు..

ఈదురుగాలులు, అధిక వర్షాలు, చెట్ల కొమ్మలు తగలడం.. తదితర సమస్యలతో ఏర్పడుతున్న అంతరాయాన్ని అధిగమించేందుకు, వెంటనే సమస్య పరిష్కరించేందుకు కొత్త విధానం తీసుకొచ్చారు. అందులో భాగంగా 33కేవీ, 11కేవీ స్తంభాలకు నంబర్లు వేయించే ప్రక్రియ చేపట్టారు. వీటి ఆధారంగా ఎక్కడ సమస్య తలెత్తితే వెంటనే సిబ్బంది నేరుగా అక్కడికి చేరుకుని తక్షణం మరమ్మతులు చేసే సౌలభ్యం కలగనుంది. ఫలితంగా అంతరాయాల సమయాన్ని గణనీయంగా తగ్గించే అవకాశం ఉంది.

రోజుకు వినియోగం (మిలియన్ యూనిట్లలో..)

కేటాయింపు: 2.88

వినియోగం: 2.27

త్వరలో అన్నిచోట్ల ఏర్పాటు

బి.శ్రీనివాస్, ఎస్ఈ, నిర్మల్

సైదీ, సైఫీ పరికరాలను ప్రస్తుతం ప్రయోగాత్మకంగా నిర్మల్‌లో అందుబాటులోకి తీసుకొచ్చాం. జిల్లాలోని అన్ని ఉపకేంద్రాల్లో దశలవారీగా ఏర్పాటు చేయనున్నాం. అంతరాయాలను కనిష్ట స్థాయికి తీసుకురావడమే లక్ష్యంగా సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆధునిక సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చారు. స్తంభాలకు నంబర్ల కేటాయింపు, ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేస్తున్నాం.

# విద్యుత్తు శాఖకు వరద షాక్..!

భానుపురి : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు విద్యుత్తు శాఖకు భారీ నష్టం జరిగింది. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురవడంతో విద్యుత్తు స్తంభాలు నేలకొరగటంతో పాటు, నియంత్రికలు కాలిపోయాయి. సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారు. వర్షాల కారణంగా జిల్లాలో నాలుగు సబ్‌స్టేషన్లు ముంపునకు గురయ్యాయి. యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టిన అధికారులు సరఫరాను పునరుద్ధరించారు.

**కాలిన నియంత్రికలు.. కూలిన స్తంభాలు**

ఈదురుగాలులు, భారీ వర్షాలకు సూర్యాపేట జిల్లాలో 2127 విద్యుత్తు స్తంభాలు కూలిపోగా, 319 నియంత్రికలు కాలిపోయాయి. జిల్లాలోని కోదాడ మండలం నల్లబండగూడెం, అనంతగిరి మండలం గోండ్రియాల, మేళ్లచెరువు మండలం దొండపాడు, రామాపురం సబ్‌స్టేషన్లు ముంపునకు గురయ్యాయి. ఈదురు గాలుల ప్రభావంతో చెట్లు, కొమ్మలు విరిగిపడి విద్యుత్తు స్తంభాలపై పడటంతో 15, 33



కేవీ స్తంభాలు, 1074, 11 కేవీ స్తంభాలు, 1038, ఎల్టీ స్తంభాలు కూలిపోయాయి. జిల్లాలో బుధవారం తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ పర్యటించారు. విద్యుత్తు సంస్థకు జరిగిన నష్టాన్ని పరిశీలించారు.

సహాయక చర్యల్లో సిబ్బంది

భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్తు సరఫరాకు ఆటంకం కలగకుండా అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. కూలిన స్తంభాల పరిధిలో సరఫరాను పునరుద్ధరణకు విద్యుత్తు ఎస్ఈ, డీఈ, ఏఈలు, సిబ్బంది తో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారు. ముంపు ప్రాంతాల్లో సరఫరా నిలిపివేసి ప్రాణనష్టం జరగకుండా చూశారు. రెండ్రోజుల నుంచి సిబ్బంది కూలిన స్తంభాల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయడంతో పాటు నియంత్రికలను అమరుస్తున్నట్లు విద్యుత్తు శాఖ ఎస్ఈ డి.ఫ్రాంక్లిన్ తెలిపారు.

# అందని పరిహారం.. అన్నదాతల్లో ఆందోళన

జగిత్యాల : ప్రస్తుత భారీ వర్షాలతో జిల్లాలో వరి, పత్తి తదితర పంటలకు నష్టం వాటిల్లుతున్నా పరిహారం చెల్లింపుపై రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలబీమా అమలు చేయకపోగా రాష్ట్ర ప్రభుత్వం కూడా కొన్ని సీజన్లుగా తగిన పరిహారం ఇవ్వటం లేదు. 2020 వానాకాలంలో అధిక వర్షాలతో పంటలను నష్టపోయిన రైతులకు 3 మాసాల్లోపు పెట్టుబడి రాయితీ (పంటనష్ట పరిహారం), 4 మాసాల్లోపు పంటలబీమా పరిహారాన్ని ఇవ్వాలని హైకోర్టు 2021 సెప్టెంబరు 28న రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది కానీ.. ఏ ఒక్క రైతుకు పరిహారాన్ని ఇవ్వలేదు. 2021 వానాకాలంలోనూ అధిక వర్షాలతో 30 వేల ఎకరాల్లో, 2021-22 యాసంగిలో రాళ్లవానలతో 12 వేల ఎకరాల్లో పంటలను రైతులు కోల్పోయినా రైతులకు పరిహారం అందలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుత నష్టంతోపాటుగా గత సీజన్లలో దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ. 10 వేల చొప్పున నష్ట పరిహారాన్ని చెల్లించాలని, ప్రస్తుత వానాకాలంలో పంటలబీమా అమలు అదను దాటిపోగా కనీసం వేసవి నుంచయినా పంటల బీమాను అమలు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

**చేయూత ఏదీ?**

జిల్లాలో 2022 వానాకాలంలో 12,588 మంది రైతులకు చెందిన 22,993 ఎకరాల్లో ఆరుతడి పంటలు, 4,130 ఎకరాల్లో వరి దెబ్బతిన్నాయి. పొలాల్లోని మెత్తటి సారవంతమైన పైపొర (హ్యూమస్) మట్టి వరదకు కొట్టుకుపోయి కేవలం ఇసుక, రాళ్లు మిగలటంతో వేలాది ఎకరాల్లో భూములు ఎందుకూ పనికిరాకుండా పోయాయి. సాగుచేసిన తోటలు, పొలాలకు గాను ఎకరాకు కనీసం రూ. 15 వేల చొప్పున జిల్లా రైతులు రూ. 40 కోట్లకుపైగా నష్టపోగా దెబ్బతిన్న పొలాలు, తోట భూములకు మరమ్మతులు చేసి మళ్లీ పంటలు సాగు చేసేందుకు రూ. 60 కోట్లకుపైగా వెచ్చించినా పరిహారం చెల్లించలేదు. 2023 వానాకాలంలో భారీ వర్షానికి 180 గ్రామాలకు చెందిన 14,065 మంది రైతులకు చెందిన 15,487 ఎకరాల్లో అన్నిరకాల పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు.



భారీ వర్షంతో లోతట్టు, ఎగువ ప్రాంతం, పొలాలు, తోటలనే తేడాలేకుండా అంతటా వరదనీరు ముంచెత్తి పైర్లను తీవ్రంగా నష్టపరచింది. - పొలాల్లో గండ్లుపడి గట్లు కూడా నామరూపాల్లేకుండా కొట్టుకుపోగా మడుల్లో ఇసుకమేటలు, బండలు పేరుకు పోయాయి. రైతులు ఎకరాకు కనీసం రూ. 17 వేల నుంచి రూ. 36 వేల వరకు పెట్టుబడిని కోల్పోగా మరమ్మతులకు ఎకరాకు రూ. 20 వేల చొప్పున వెచ్చించారు. 2024 వేసవిలోనూ 5,100 ఎకరాల్లో మామిడికి గాలివానలతో నష్టం వాటిల్లినా పరిహారం చెల్లించలేదు.

2023- మార్చి, ఏప్రిల్ మాసాల్లో దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ. 10 వేల చొప్పున పరిహారం ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి ంది. మార్చిలో జిల్లాలో 6,199 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా 532 ఎకరాలకు మాత్రమే పరిహారం చెల్లించారు.

ఏప్రిల్‌లో 52 వేల ఎకరాల్లో మామిడి, వరి, మక్క, నువ్వు, జొన్న, కూరగాయలు తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లినా ఒక్క రైతుకు కూడా పరిహారం చెల్లించలేదు.

# వెలుగు లేదు.. పొయ్యి వెలగలేదు..!



ఖమ్మం: వరద తరిమిన తరుణంలో నిత్యావసరాలు, ఖరీదైన సామగ్రి.. వివిధ రకాల వస్తువులతో ఇళ్లు కళకళలాడాయి. 24 గంటల్లోనే ఆశల సౌధాల రూపురేఖలే మారిపోయాయి. ఇది మా ఇళ్లు కాదేమో అనేలా ఛిన్నాభిన్నమయ్యాయి. ఇంటిల్లిపాది రెక్కలు ముక్కలు చేసుకుని కొనుక్కున్న ఖరీదైన వస్తువులు నీళ్లల్లో తడిసి ఎందుకూ పనికిరాకుండా పోయాయి. వరద తగ్గుముఖం పట్టిన తరువాత ఇళ్లకు చేరుకొని గుండెలవిసేలా రోదిస్తున్నారు. బాధిత కాలనీల్లో మూడోరోజూ పొయ్యి వెలగలేదు. కొంతమంది ఇళ్లల్లో విద్యుత్తు వెలుగులు లేవు. అగ్గిపెట్టె నుంచి ఏసీల వరకు మున్నేరు చుట్టుకెళ్లటంతో బాధితులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

**పంటి కింద బాధను దిగమింగుకొని..**

పునరావాస కేంద్రాల్లో సర్కారు పంపిణీ చేసిన లేదా దాతలు ఇచ్చిన అన్నమో తినేందుకు కూడా ఇంట్లో స్థలం లేక, కంటి నిండా నిద్ర పోదామన్నా పడుకునేందుకు మంచం లేక పంటి కింద బాధను దిగమింగుకొని బతుకీడ్చుతున్నారు. సాయం కోసం దీనంగా వీధుల వైపు చూస్తున్నారు. ఆహార పొట్లాలు ఎవరైనా ఇస్తారా.. కనీసం దాహం కేకలైనా తీర్చేందుకు వస్తారా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. మున్నేరు వరద విలయంతో కకావికలమైన ఖమ్మం నగరంలోని ముంపు కాలనీల్లో హృదయ విదారక దృశ్యాలు కనిపిస్తున్నాయి.

**కూలీలూ దొరకట్లే ..**

సర్వం కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో ఉన్న బాధితులు.. మూడోరోజూ ఇంటిని శుభ్రం చేసుకునేందుకే సమయం కేటాయించారు. నాలుగడుగుల మేర బురద మేటలు వేసిన ఇళ్లను సాధారణ స్థితికి చేర్చేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. కొన్నిచోట్ల ప్రభుత్వ సిబ్బంది బురద మేటలను తొలగిస్తున్నారు. ఇంతోఅంతో ఆర్థికంగా ఉన్న కుటుంబాలు కొంత ఖర్చు చేసైనా ఇళ్లను బాగుచేసుకుందామని కూలీలను ఆశ్రయిస్తే.. వామ్మో మున్నేరు పరీవాహక ప్రాంతంలో అసలు తమకు పనే వద్దంటున్నారు. ఇంకొందరు ఏకంగా రూ. 2వేలు డిమాండ్ చేస్తున్నారు. ఇళ్లు శుభ్రం చేసుకునేందుకు నీళ్లు లేక.. ప్రైవేటు ట్యాంకర్లు దొరక్క.. మళ్లీ వరద జలాలే దిక్కవుతున్నాయని బాధితులు ఆవేదన చెందుతున్నారు. చిన్నపిల్లలను బంధువుల ఇళ్ల వద్ద వదిలేసి పెద్దలంతా కలిసి ఇళ్లను సర్దుకుంటున్నారు.

**దాహం కేకలు**

బాధిత కాలనీల్లో దాహం కేకలు మిన్నంటుతున్నాయి. తాగునీటి సరఫరా సక్రమంగా సాగటం లేదు. నగరపాలక సంస్థ తాగునీటి ట్యాంకులు పంపుతున్నా చిన్నచిన్న కాలనీలు, గల్లీల్లోకి వాహనాలు వెళ్లలేకపోతున్నాయి. భోజనం పరిస్థితీ అంతే. పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి మాత్రమే సక్రమంగా ఆహారం అందుతోంది. ఇళ్లల్లో ఉ న్నవారు.. స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఇచ్చే భోజనాలతో కడుపు నింపుకొంటున్నారు. కాసింత అన్నం దొరికినా చెత్తకుప్పలు, దుర్వాసన మధ్యే తింటున్నారు. ప్రభుత్వం అందించే భోజనం, తాగునీరు సక్రమంగా అన్ని కాలనీలకు చేరేలా చూడాలని బాధితులు కోరుతున్నారు.

# 'పెద్ద'తప్పు చేశారు..!



నల్గొండ : పెద్ద చెరువును ఆక్రమించి ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన అక్రమ కట్టడాలు, అలుగు పారి నీళ్లు దిగువకు వెళ్లే తమ్మెర వాగు కుచించుకుపోవడం తదితర కారణాలతోనే కోదాడలోని శ్రీనగర్ కాలనీ, నయానగర్, శిర్డీ సాయి నగర్‌లు ముంపునకు గురయ్యాయని అధికారులు ప్రాథమికంగా తేల్చారు. స్థిరాస్తి వ్యాపారులు, కొందరు ప్రజాప్రతినిధులు ఆక్రమణల్లో భాగస్వామ్యం కావడం, అనుమతుల్లేకుండానే కట్టడాలు నిర్మించడంతో దిగువకు వచ్చిన కొద్దీ తమ్మెర వాగు చిన్న పిల్ల కాలువలా మారింది. కోదాడ పట్టణంలో ఇటీవల జరిగిన ముంపు నష్టం ఎక్కువగా తమ్మెర వాగు వల్లే కల్గింది.

కోదాడ పట్టణానికి ఆనుకొని సర్వే నంబరు 145లో 720 ఎకరాల్లో పెద్ద చెరువు విస్తరించి ఉండగా.. దక్షిణం, ఉత్తరం, తూర్పు వైపున ఎవరికి వారు భూములను ఆక్రమించుకొని సుమారు 300 ఎకరాల్లో నిర్మాణాలు చేపట్టారు. ఖమ్మం రహదారిపై ఉన్న తమ్మెర బ్రిడ్జిని ఆక్రమించుకొని నాలుగైదేళ్ల క్రితం వేసిన ఓ స్థిరాస్తి వెంచర్‌లో పార్కును ఏకంగా వాగును చదును చేసి నిర్మించడం గమనార్హం. బ్రిడ్జి దిగువన ఏకంగా వాగులోనే వెంచర్ వేసినా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఎగువ నుంచి వచ్చే నీటికి అడ్డంగా శ్రీనగర్ కాలనీలో సదరు వెంచర్ చుట్టూ ప్రహరీ నిర్మించడంతో వరద నీళ్లు ఎటూ వెళ్లలేక ఇళ్లను ముంచెత్తాయి.

మరోవైపు చెరువు బఫర్ జోన్‌తో పాటూ ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ కట్టడాలను నియంత్రించాల్సిన పురపాలిక, నీటిపారుదల శాఖ అధికారులు బాధ్యత మీదంటే మీదంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. సర్వే చేసి బఫర్ జోన్ ఎంత అనే తేల్చితే తప్పా.. అక్రమ కట్టడాలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేమని సంబంధిత అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇంత జరిగినా ఇప్పటివరకు అధికారులెవరూ ఆక్రమణలపై ఎటూ తేల్చకపోవడం గమనార్హం. ఆక్రమణలపై గతంలోనూ పలు ఫిర్యాదులు చేసినా అధికారులెవరూ చర్యలు తీసుకోలేదని ముంపు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అడ్డుగా గోడ ఉండటం వల్లే

పెద్దచెరువు అలుగు నుంచి వచ్చే వరద తమ్మర వాగులో కలిసి దిగువకు వెళ్లాలి. తమ్మర వాగును ఎగువ నుంచి అందరూ ఆక్రమించడంతో వరద అంతా ఇళ్లల్లోకి వచ్చింది. పక్కన ఉన్న స్థిరాస్తి వెంచర్ వరద ప్రవాహానికి అడ్డుగా గోడ కట్టడం వల్ల వాగులోకి నీళ్లు వెళ్లలేదు. ముంపుతో సర్వం కోల్పోయాం.

– రమణమ్మ, శ్రీనగర్‌కాలనీ, కోదాడ


ఆక్రమణలతోనే ముంపు

పెద్ద చెరువు ఆక్రమణలపై గతంలోనూ పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. మొత్తం 720 ఎకరాల్లో సుమారు 300 ఎకరాల్లో అక్రమ కట్టడాలు వెలిశాయి. చెరువు అలుగు వచ్చే మార్గాన్ని కబ్జా చేయడంతోనే ఈ ముంపు పరిస్థితులు తలెత్తాయి. ఇప్పటికైనా అధికారులు సర్వే చేసి ఆక్రమణలను తొలగించాలి.

– కుందరవల్లి బసవయ్య, సామాజిక కార్యకర్త, కోదాడ

# మీలో ఎవరు లక్షాధికారి..!

ఆలేరు : పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపే విద్యార్థులకు లక్షాధికారి అయ్యే అవకాశం దక్కనుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) డిగ్రీ విద్యార్థులకు క్విజ్ పోటీలను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తోంది. ఆర్బీఐ 90వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా దేశవ్యాప్తంగా డిగ్రీ స్థాయిలోని విద్యార్థులకు 'ఆర్బీఐ 90' పేరిట జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించేందుకు నిర్ణయించింది. ఈ మేరకు ఇప్పటికే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కాగా.. ఈ నెల 17 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశముంది. ఈ నెల 19 నుంచి 21 వరకు ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ఆన్‌లైన్ పోటీలు జరగనున్నాయి. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ కలిపి మొత్తం 75 డిగ్రీ కళాశాలలుండగా సుమారు 32 వేల మంది విద్యార్థులు చదువుతు న్నట్లుగా సమాచారం. ముఖ్యంగా విద్యార్థుల్లో రిజర్వ్ బ్యాంక్, ఆర్థిక వ్యవస్థ గురించి అవగాహన, డిజిటల్ లావాదేవీలు, సురక్షితం, బాధ్యతాయుత వినియోగం వారిని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ పోటీలు ఏర్పాటు చేయనున్నట్లుగా తెలిసింది. 2024 సెప్టెంబరు 1 నాటికి 25 ఏళ్లలోపు వయసు ఉండి ఏదైనా కళాశాలలో డిగ్రీ చదువుతున్న వారు పోటీల్లో పాల్గొనవచ్చు. %www.rbi90quiz.in% అనే వెబ్‌సైట్ ద్వారా ఈ పోటీల్లో పాల్గొనేందుకు ప్రతి కళాశాల నుంచి ఎంతమందైనా రిజిస్టర్ చేసుకోవచ్చు. ఒక బృందానికి కనీసం ఇద్దరు ఉండాలి. నాలుగు దశల్లో పోటీలు జరగనున్నాయి. తొలుత జిల్లా స్థాయిలో ఆన్‌లైన్ దశతో ప్రారంభమై రాష్ట్ర, జోనల్, జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు. ఆంగ్లం, హిందీ భాషల్లో పోటీలు ఉంటాయి. ప్రధానంగా దేశ, అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాలు, ఆర్బీఐ డిజిటల్ కరెన్సీ, ఆర్థిక వ్యవస్థ, క్రీడలు, చరిత్ర, సాహిత్యం, సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్ తదితర అంశాలపై ప్రశ్నలుంటాయి.



# పనులు పూర్తి చేయరు.. ఇళ్లు అప్పగించరు

ముస్తాబాద్ : ఇళ్లు లేని నిరుపేదలకు రెండ పడక గదుల ఇళ్లు కట్టి ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు నిర్మాణాలు చేపట్టారు. పనులు చివరి దశకు చేరుకొని చిన్న చిన్న పనులు మిగిలిపోయాయి. వీటిని పూర్తి చేసి అప్పగించేందుకు గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈలోగా శాసన సభ ఎన్నికలు రావడంతో పనుల్లో జాప్యం నెలకొంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు తిరిగి పనులు చేపట్టిన దాఖలాలు లేదు. ఫలితంగా అసంపూర్తి పనులతో కొండాపూర్, గూడెం గ్రామాల్లో అలంకారప్రాయంగా మారాయి. మరోవైపు పేదల సొంతింటి కల నెరవేరని దుస్థితి ఏర్పడింది.

ముస్తాబాద్ మండలంలో ముస్తాబాద్, మోహినికుంట, మద్దికుంట, పోత్గల్, చిప్పలపల్లి గ్రామాల్లో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. అప్పటి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించారు. కొండాపూర్‌లో రెండు పడక గదుల ఇళ్లు 40 నిర్మించారు. తలుపులు, కిటికీలు, ప్లంబింగ్, సెప్టిక్ ట్యాంకులు, పెయింటింగ్ పనులు చేయాల్సి ఉంది.

రెండు పడక గదుల ఇళ్ల చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగాయి.



మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి పనులు త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

గూడెం గ్రామానికి 50 ఇళ్లు మంజూరు కాగా వీటిలో 48 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. సెప్టిక్ ట్యాంకులు, ఛాంబర్స్, ఎలక్ట్రికల్ వంటి చిన్న చిన్న పనులు మిగిలి ఉన్నాయి. త్వరగా పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇంతలోనే ప్రజాప్రతినిధుల పదవీ కాలం ముగిసింది. సంబంధిత అధికారులు కూడా వాటిపై దృష్టిసారించిన దాఖలాలు లేవని లబ్ధిదారులు వాపోతున్నారు.

ఏడాది పైగా ఎదురుచూస్తున్నా

ఇళ్లు లేని పేదలను గుర్తించి పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని భావించారు. ఇందులో భాగంగా నన్ను ఎంపిక చేశారు. ఇల్లు వచ్చిందని సంతోషించాం. చిన్న చిన్న పనులు మిగిలి ఉన్నాయి. అవి పూర్తి చేసి అప్పగిస్తామన్నారు. ఇంతవరకు పూర్తి చేయలేదు. ఇల్లు అప్పగించలేదు. ఎప్పుడు ఇస్తారా అని ఏడాది పైగా ఎదురుచూస్తున్నాను. పనులు పూర్తి చేసి నాలాంటి పేదవారికి అప్పగించాలి.

కాసారపు మేఘమాల, గూడెం

చర్యలు తీసుకొంటాం

కొండాపూర్, గూడెం గ్రామాల్లో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీస్తాం. ఏయే పనులు మిగిలిపోయాయి అనే వివరాలు తెలుసుకొని సదరు గుత్తేదారుతో మాట్లాడి పనులు త్వరగా పూర్తిచేసేందుకు చొరవ చూపుతాం. సురేశ్, తహసీల్దార్, ముస్తాబాద్

# ప్రశాంత వేడుకలు

వికారాబాద్: వినాయక చవితి పండుగకు ఇక ఎంతో సమయం లేదు (ఈనెల 7న పండుగ). ఈ నేపథ్యంలో జిల్లాలోని పల్లె, పట్నం అనే తేడా లేకుండా గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించడానికి నిర్వాహకులు సన్నద్ధం అవుతున్నారు. ఏటా గణేష్ నవరాత్రులను జిల్లాలో భారీ ఎత్తున నిర్వహిస్తారు. తమ శక్తి మేరకు మండపాలను ఏర్పాటు చేసి, చిన్నా పెద్ద తేడా లేకుండా భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలతో పాటు అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలతో గణేష్ నవరాత్రులు వైభవంగా చేపడుతుంటారు. ఈ ఏడాది కూడా వికారాబాద్, తాండూర్, పరిగి, కొడంగల్ ప్రధాన పట్టణాలతో పాటు పల్లెల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ఇప్పటినుంచే మండపాల నిర్మాణాలకు సన్నద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ అధికారి (ఎస్పీ) నారాయణరెడ్డి పలు సూచనలు చేశారు. మండపాల నిర్మాణానికి పోలీసుల అనుమతి తప్పనిసరని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, చట్టపరమైన నిబంధనలు పాటించకుంటే కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పాటించాల్సిన నిబంధనలు

విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు ఎలాంటి శాశ్వత నిర్మాణాలు చేపట్టరాదు.

మండపాల ఏర్పాటుకు ఉత్తమమైన వస్తువులు వాడకం.

ప్రజల తాకిడి, గాలి వీచినప్పుడు, వర్షం పడితే ఇబ్బంది కలుగకుండా, కూలిపోకుండా చూడటం.

మండపాల పైభాగం నీరు పడని పట్టాలతో కప్పడం.

విద్యుత్తు కనెక్షన్, లైట్ల ఏర్పాటుకు నాణ్యమైన పరికరాలను వినియోగించడం.

సంబంధిత డీఎస్పీ అనుమతులు లేకుండా ఎలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించకూడదు.

రాత్రి 10 గంటల తర్వాత ఎలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టరాదు.



మండపాల పేరుతో ఎలాంటి లక్కీ డ్రా, జూదం నిర్వహించకూదు. డబ్బు వసూళ్లకు పాల్పడరాదు.

మండపాల వద్ద మద్య నిషేధం అమలు.

అసాంఘిక కార్యకలాపాలు, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించకూడదు.

మండపాల వద్ద ఎలాంటి టపాసులు కాల్చరాదు.

మండపాల వద్ద 24 గంటలు కనీసం ముగ్గురు వాలంటీర్లు విగ్రహంతో పాటు ఉండాలి. అక్కడ ఉండే పూజ, ఇతర సామగ్రిని పర్యవేక్షిస్తుండాలి. వారి వివరాలు ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలి.

అత్యవసరంలో ఫోన్ చేయాల్సిన నంబర్.. 100

జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ ఫోన్ నం.. 08416-255606,

మరొక నంబర్: 8712670056

అత్యవసరమైతే సమాచారం ఇవ్వండి

గణేశ్ ఉత్సవాలను జిల్లాలో అందరూ సమైక్యంగా ప్రశాంతంగా నిర్వహించాలి. ఏదైనా అత్యవసరం ఉంటే పోలీసులకు వలంటీర్లు, ఇతరులు ఎవరైనా సమాచారం ఇవ్వవచ్చు. భక్తులు సందర్శించే సమయాల్లో క్యూలైన్ విధానం అమలు చేస్తే మేలు.

# గుండె దడదడనే

హైదరాబాద్ లాంటి మహానగరంలోని కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి రూపుదిద్దుకుంది. అత్యవసర పరిస్థితుల్లో స్థానికంగానే వైద్యం అందించాల్సి ఉంది. ఇందులో కార్డియాలజీ విభాగం పాత్ర కీలకం. అందుకే ప్రభుత్వం నాలుగు కార్డియాలజీ పోస్టులను మంజూరు చేసింది. కానీ భర్తీ చేయలేదు. ఫలితంగా గుండెనొప్పితో సూపర్ స్పెషాలిటీకి వచ్చే రోగుల ప్రాణాలకు భరోసా లేకుండా పోతోంది. ఆదిలాబాద్‌లో 2019లో ఉమ్మడి జిల్లా చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(సీసీఎఫ్)గా పని చేసిన సంజయ్‌కుమార్ గుప్తా గుండెనొప్పితో రిమ్స్‌కు వచ్చినా ప్రాణాలు దక్కలేదు. ఇటీవల మాజీ ఎంపీ రమేష్ రాథోడ్, అంతకుముందు బ్యాంకు అధికారి ధర్మేందర్, తాజాగా గురువారం సంతోష్(40) గుండెనొప్పితో ప్రైవేటు ఆసుపత్రుల్లో కన్నుమూయడం కార్డియాల జిస్టుల కొరతను చాటి చెబుతోంది. ఇవి మచ్చుకు కొన్ని ఘటనలే. ఒకవేళ రిమ్స్‌లో నిపుణులైన కార్డియాలజిస్టులు ఉంటే ప్రాణాలను రక్షిస్తారనే భరోసా ఉంటుంది.

నిర్లక్ష్యమే – సురేందర్ రిమ్స్‌లో వైద్యులను నియమించకపోవటం ప్రభుత్వ నిర్లక్ష్యమే. ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవటం లేదు. గతంలో భారాస, ఇప్పుడు కాంగ్రెస్, ప్రభుత్వాలు మారాయే తప్పితే రోగులకు జరిగిన న్యాయమేం లేదు.

నమూనా కోసమే – రూపేష్‌రెడ్డి

రిమ్స్ సహా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నమూనా కోసమే అన్నట్లు ఉంది. సాధారణ వైద్యం, చిన్నపాటి శస్త్ర చికిత్సలు కమ్యూనిటీ ఆసుపత్రుల్లోనూ చేస్తారు. కానీ రూ.వందల కోట్లతో ఏర్పాటు చేసిన ఆసుపత్రిలో వైద్యుల పోస్టులు భర్తీ కాకుంటే ఫలితమేముంటుంది.

కనికరమే లేదు– కిరణ్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పేదలంటే కనికరం లేదు. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పేర్లు చెప్పడం గొప్ప కాదు. ఆపదలో ఉన్న రోగులకు ప్రాణం పోశారా లేదా అనేది ముఖ్యం. ఎమ్మారై పరీక్షల్లేవు. కార్డియాలజీ పరీక్షలు చేసే వారే లేరు. పేరుకే పెద్దాసుపత్రి.

ప్రభుత్వానికి నివేదించాం– డా.జైసింగ్ డైరెక్టర్

కార్డియాలజీ, నెఫ్రాలజీ, గ్యాస్ట్రో, న్యూరోఫిజిషియన్ల పోస్టులు చాలా కీలకమే. అందులో కొరత ఉన్న మాట నిజమే. తాజాగా ఏడుగురు వైద్యులకు బదిలీ జరిగింది. అందుబాటులో ఉన్న వైద్యులతో రోగులకు ఇబ్బందుల్లేకుండా చూస్తున్నాం. తప్పనిసరైతే రెఫర్ చేస్తాం. ఖాళీల విషయమై ప్రభుత్వానికి నివేదించాం. ఆసక్తి కలిగిన వైద్యులు ముందుకొస్తే కాంట్రాక్టు పద్ధతిలో వెంటనే భర్తీ చేస్తాం.

# కర్షకుల కష్టం.. వరదార్పణం!

ఆసిఫాబాద్ : జిల్లాలో తెరిపివ్వకుండా వారం రోజుల నుంచి వర్షం కురుస్తుండటంతో.. ఆయా నదుల పరీవాహక ప్రాంతాల రైతుల చేల పంటలన్నీ నీట మునిగాయి. రోజుల తరబడి నీటిలో మునిగి ఉండటంతో నెల రోజుల వయసున్న పత్తి మొక్కల ఆకులు నల్లగా మారి వాడిపోతున్నాయి. జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో నదులు, వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వీటితో పాటు పెద్దవాగు, ప్రాణహిత, పెన్‌గంగా నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో.. పరీవాహక ప్రాంతాల పంట చేలన్నీ వరదతో ముంచేశాయి. జిల్లాలో ప్రధాన పంట అయిన పత్తిని ఏటా వానకాలంలో నదుల వరద తుడిచి పెడుతుందని అన్నదాతలు వాపోతున్నారు. గత ఏడాది సైతం ఆగస్టులో దాదాపు 35 వేల ఎకరాల్లో పంట నష్టపోయామని, సర్వే చేసినా పరిహారం మంజూరు కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 3.40 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నారు. ఆయా నదుల పరీవాహక ప్రాంతాల్లో సుమారు 50వేల ఎకరాల్లో పంటలు రైతులు పండిస్తున్నారు. ప్రాణహిత, పెన్‌గంగ ప్రస్తుత వరదలతో సిర్పూర్(టి), కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూర్ మండలాల్లోని దాదాపు 10 వేల ఎకరాల పంట నష్టపోయింది. దహెగాం,



పెంచికల్‌పేట్ మండలాల్లోని పలు గ్రామాల్లో పెద్దవాగు జలాలు పత్తి పంటకు తీవ్ర నష్టం కలగజేశాయి. ఇక అన్ని మండలాల్లో ఉన్న చిన్నపాటి వాగులు, ఒర్రెల ప్రవాహంతో అనేక పత్తి చేలు నీళ్లల్లోనే ఉంటున్నాయి. మరికొన్ని రోజులు వర్షాలు పడే అవకాశం ఉన్నందున అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి ఆదుకోవాలని విన్నవిస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి..

పత్తి మొక్కలు నిరంతరం నీళ్లలో ఉండటంతో ఆకులు నల్లగా మారి రాలిపోతున్నాయని, మరికొన్ని రోజులు వరద నీటిలోనే పత్తి మొక్కలు ఉంటే పూర్తిగా ఎండిపోయి తొలగించాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. బోరాన్, పొటాషియంను లీటరుకు నీటికి రెండు గ్రాముల చొప్పున కలిపి పత్తి మొక్కలపై పిచికారీ చేస్తే ఆకులు నల్లగా మారే సమస్య తగ్గుతుందని పేర్కొంటున్నారు. నిలిచిన నీటిని వెంట వెంటనే తొలగించాలని సూచించారు.

తప్పని పెట్టుబడి భారం..

నెల, నెలన్నర కిందట నాటిన పత్తి పంట చాలా వరకు వర్షార్పణం కావడంతో.. అన్నదాతలు మళ్లీ విత్తుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే రెండు దఫాలుగా ఎరువులు వేశారు. ఇప్పటికే అధిక మొత్తంలో పెట్టుబడి పెట్టామని, మళ్లీ విత్తనాలు తెచ్చి వేయాలంటే ఆర్థిక భారం అవుతుందని కర్షకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా వర్షాలకు నష్టపోయిన పంటల సర్వే గురించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని అధికారులు అంటున్నారు.

ఇప్పటి వరకు రూ.40 వేల పెట్టుబడి సిర్పూర్(టి) మండలం దుబ్బగూడ గ్రామానికి చెందిన బాబురావు నాలుగు ఎకరాల్లో పత్తి పంట వేశారు. పెన్‌గంగ జలాలతో పంట పూర్తిగా నీట మునిగింది. రూ.40 వేల వరకు పెట్టుబడి ఖర్చుయిందని, అధికారులు ఆదుకోవాలని ఆయన కోరుతున్నారు. పరిహారం అందించాలి సిర్పూర్(టి) మండలానికి చెందిన రామ్‌చందర్ మూడు ఎకరాల్లో పత్తి సాగు చేయగా ప్రస్తుత వర్షాలతో పూర్తిగా మునిగిపో యింది. మొక్కలన్నీ నల్లగా మారుతున్నాయి. పెన్‌గంగ జలాలు చుట్టుముట్టి ఏటా ఈ ప్రాంతంలో వేలాది ఎకరాల పంటలు నీట మునుగుతున్నాయని పరిహారం అందించి ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

# వంతు వచ్చేవరకు..ఉగ్గబట్టుకోవాల్సిందే..!



కోరుట్ల: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు గత ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని చేపట్టగా ప్రస్తుత ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపడుతోంది. నిధుల కొరతతో చాలా పాఠశాలల్లో అభివృద్ధి పనులు నిలిచి పోయాయి. చాలా పాఠశాలల్లో వందల సంఖ్యలో విద్యార్థులుంటే ఒకటి రెండు మూత్రశాలలు, మరుగు దొడ్లు ఉండగా విద్యార్థుల బాధ వర్ణనాతీతం. ఉన్నవి కూడా శిథిలావస్థలో ఉండడం సరైన సౌకర్యాలు లేవు. మూత్రశాలల ముందు బారులు తీరుతూ ఉగ్గ పట్టుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**జూనియర్ కళాశాలకు వెళ్లాల్సిందే**

కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూత్రశాలలు లేకపోవడంతో విద్యార్థులు పక్కనే ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల మూత్రశాలలను వినియోగించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పాఠశాలలో విద్యార్థినులు 252 మంది, విద్యార్థులు 60 మంది కలిపి మొత్తం 312 మంది చదువుకుంటున్నారు. పాఠశాలలో పాత మూత్రశాలలు ఉండటంతో వాటిని పూర్తిగా తొలగించారు. ఆ స్థలంలో మనబస్తీ–మనబడి కింద మంజూరైన నిధులతో తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. పనులు ప్రారంభించి ఏడాది గడిచినా పిల్లర్ల నిర్మాణం చేపట్టి గుత్తేదారు మధ్యలోనే వదిలేశారు.

**278 మందికి రెండే మరుగుదొడ్లు**

ఇబ్రహీంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాలలో మొత్తం 278 మంది విద్యార్థులున్నారు. పాఠశాలలో కేవలం రెండే మరుగు దొడ్లు ఉండగా వాటి పక్కన ఒపెన్ మూత్రశాలలున్నాయి. పాఠశాలను మన ఊరు–మన బడిలో ఎంపిక చేయగా నిర్మాణాలు మధ్యలో నిలిచి పోయాయి. ఉన్న మూత్రశాలల వద్ద నిత్యం విద్యార్థులు విరామ సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఎస్ఎస్ఏ పథకంలో భాగంగా మూత్రశాలల నిర్మాణాన్ని ప్రారంభించగా గుత్తేదారుడికి బకాయిలు రాకపోవడంతో నిర్మాణాన్ని మధ్యలోనే నిలిపివేయడంతో మూత్రశాలలు అందుబాటులోకి రాలేదు.

**మరమ్మతు చేపట్టడంలో నిర్లక్ష్యం**

రాయికల్ మండలంలో 32 గ్రామాలు ఉండగా 12 ఉన్నత, 41 ప్రాథమిక పాఠశాలలున్నాయి. మండల వ్యాప్తంగా 3638 మంది విద్యార్థులు చదువుతున్నారు. మండలంలోని అల్లీపూర్ గ్రామంలో రెండు ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాల ఉండగా విద్యార్థులకు సరిపడా మూత్రశాలు, మరుగుదొడ్లు లేకపోవడంతో ఆరు బయటకు వెళ్లాల్సి వస్తోంది. గడికోట ప్రాథమిక పాఠశాలలో 130 మంది విద్యార్థులకు ఒకే మరుగుదొడ్డి, అల్లీపూర్ ఉన్నత పాఠశాలలో 301 మంది విద్యార్థులకు రెండు మూత్రశాలలు, మరుగుదొడ్డి మాత్రమే ఉన్నాయి. గతంలో దాతల సాయంతో ఏర్పాటు చేసిన మూత్రశాలలు మరమ్మతు చేయకపోవడంతో వినియోగానికి దూరమయ్యాయి. పాఠశాలలకు రెండు మరుగుదొడ్లు, వంట గదుల నిర్మాణానికి రూ.28 లక్షల చొప్పున మంజూరు కాగా పనులు ప్రారంభం కాలేదు.

**నీటి వసతి లేక..**

సారంగాపూర్ మండలంలో అయిదు ఉన్నత, మూడు ప్రాథమికోన్నత, 25 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. మండలంలోని రేచపల్లిలో ఒకే ఆవరణలో ఉన్నత, ప్రాథమిక, అంగన్‌వాడీ పాఠశాలలు కొనసాగుతున్నాయి. ఇందులో ఉన్నత పాఠశాలలో 203, ప్రాథమిక పాఠశాలలో 49, అంగన్‌వాడీ కేంద్రంలో 10 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో కేవలం రెండే మూత్రశాలలు ఉన్నాయి. రంగపేటలో 93, అర్పపల్లిలో 99 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ మూత్రశాలల నిర్మాణాలు చేపట్టినప్పటికీ అర్ధంతరంగా పనులు నిలిపివేయడంతో బాలికలు ఇబ్బంది పడాల్సి వస్తోంది. మిగతా పాఠశాలల్లో మూత్రశాలలు ఉన్నప్పటికీ నీటి వసతి లేకపోవడంతో ముక్కుమూసుకొని పోవాల్సిన పరిస్థితి.

# అంచనాలను 'భట్టి' కేటాయింపులు



హైదరాబాద్: :కాంగ్రెస్ ప్రభుత్వ మొదటి పద్దులో అంచనాల నుబట్టి కేటాయింపులు జరిగాయి. మహానగరం చుట్టూ టౌన్‌షిప్‌లకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 5 కి.మీ. పరిధిలో నిర్మాణానికి పచ్చజెండా ఊపింది. భద్రత విషయంలో ప్రాధాన్యమిస్తూ రాజధాని పోలీసింగ్‌కు రూ.345 కోట్లు కేటాయించింది. వీటిలో హైదరాబాద్ కమిషనరేట్‌కు ఎక్కువ ఇచ్చింది. ఎంఎంటీఎస్ రెండోదశ పూర్తయినా కొత్త రైళ్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రూ.50 కోట్లు కేటాయించింది. ఇలా అంచనాల ఖర్చు ఎలా ఉన్నా.. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఆచితూచి హద్దుల్లో ఉండేలా పద్దులు రాశారు.

బాహ్యవలయ రహదారి వరకు భాగ్యనగరమే. ఈ ప్రాతిపదికనే రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి ప్రణాళికలు రచిస్తోంది. హైదరాబాద్ జిల్లా పూర్తిగా, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాలు పాక్షికంగా నగర పరిధిలోకి వస్తున్నాయి. రాజధాని పరిధిలో ఉండటంతో వేర్వేరు రంగాల్లో ఈ జిల్లాలు అగ్రపథంలో ఉన్నాయి. కొన్నింటి విషయంలో మెరుగు కావాల్సి ఉందనే సంకేతాలను శాసన సభలో గురువారం బడ్జెట్ సందర్భంగా ప్రవేశపెట్టిన తెలంగాణ–ఆర్థిక సామాజిక విశ్లేషణ–2024 నివేదిక వెల్లడించింది. తలసరి ఆదాయంలో.. తలసరి ఆదాయంలో ప్రస్తుత ధరలు(2022–23) ప్రకారం రంగారెడ్డి జిల్లా రూ.9,46,862 మొదటి స్థానంలో ఉంది. హైదరాబాద్ రూ.4,94,033 రెండో స్థానంలో ఉండగా.. సంగారెడ్డి జిల్లా రూ.3,22,394 మూడో స్థానంలో, మేడ్చల్ జిల్లా 2,95,514 నాలుగో స్థానంలో నిలిచింది.

ఉత్పత్తులలోనూ మనమే.. జిల్లా స్థూల ఉత్పత్తులు గ్రాస్ డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్ట్(జీడీడీపీ) ప్రకారం రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాలు వరసగా మొదటి నాలుగు స్థానంలో ఉన్నాయి.

రంగారెడ్డి జిల్లాలో వార్షికంగా (2022–23 ) ప్రస్తుత ధరల ప్రకారం రూ.2,83,410 కోట్ల విలువైన వస్తుసేవల ఉత్పత్తితో రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిచింది. హైదరాబాద్ రూ.2,28,623 కోట్లు, మేడ్చల్ మల్కాజిగిరిలో రూ.88,867 కోట్లు, సంగారెడ్డి జిల్లాలో రూ.60,401 కోట్ల విలువైన ఉత్పత్తులు వెలువడ్డాయి.

టౌన్‌షిప్‌లకు చకచకా అడుగులు!

**పేద, మధ్య తరగతి వర్గాలకు అందులో నివాసాలు**

మహా నగరం చుట్టూ టౌన్‌షిప్‌లు సాకారం కానున్నాయి. వీటిని ప్రోత్సహిస్తామని తాజా బడ్జెట్‌లో విత్త మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. వాటిలో పేదలు, మధ్యతరగతి వర్గాలకు నివాస సముదాయాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇప్పటికే హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) పరిధిలో ప్రత్యేక టౌన్‌షిప్ పాలసీని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అవుటర్ తరువాత 5 కిలోమీటర్ల పరిధిలో టౌన్‌షిప్‌ల నిర్మాణానికి పచ్చజెండా ఊపింది. ఇప్పటికే కొన్ని సంస్థలు ముందుకొచ్చి దరఖాస్తు చేసుకున్నాయి. తాజా బడ్జెట్‌లో వాటిని ప్రోత్సహించేందుకు సంసిద్ధత వ్యక్తంచేయడంతో హెచ్ఎండీఏ ప్రత్యేకంగా దృష్టి సారించనుంది. ఇప్పటికే రెండు ప్రాజెక్టులకు సంబంధించి హెచ్ఎండీఏకు దరఖాస్తులు అందాయి. దీనిపై ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించేందుకు హెచ్ఎండీఏ గతంలో నోటిఫికేషన్ జారీచేసింది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం దామర్లపల్లి ప్రాంతంలో 533 ఎకరాల్లో టౌన్‌షిప్ నిర్మాణానికి ఓ సంస్థ దరఖాస్తు చేసింది. ఇదే జిల్లాలోని నందిగామ మండలం చేగూరు ప్రాంతంలో 100 ఎకరాల్లో టౌన్‌షిప్‌నకు మరో సంస్థ కూడా దరఖాస్తు చేసింది.

**రాజధాని పోలీసింగ్‌కు రూ.345 కోట్లు**

హైదరాబాద్ కమిషనరేట్‌కు రూ.316 కోట్లుబడ్జెట్‌లో రాజధాని పోలీసింగ్‌కు ఈసారి భారీగానే నిధులు దక్కాయి. సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లకు నిధుల్లో కోత విధించినా.. హైదరాబాద్‌కు భారీగా కేటాయింపులు పెరిగాయి. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మూడు కమిషనరేట్లకు సవరించిన అంచనాలతో కలిపి ప్రభుత్వం రూ.226.32 కోట్లు కేటాయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఇది రూ.345.84 కోట్లకు పెరిగింది. హైదరాబాద్‌కు గతేడాది రూ.176.26 కోట్లు కేటాయించగా.. ఈసారి 316.44 కోట్లు ప్రతిపాదించింది. అంటే దాదాపు రూ.140 కోట్లు (40 శాతం) మేర నిధులు పెరిగాయి. సైబరాబాద్‌కు రూ.24.28 కోట్ల నుంచి రూ.20 కోట్లకు తగ్గాయి. రాచకొండ కమిషనరేట్‌కూ నిరాశే. గతేడాది రూ.25.48 కోట్ల కేటాయింపులుండగా ఈసారి రూ.9.4 కోట్లు మాత్రమే దక్కాయి.

**రూ.లక్షతో కార్యాలయ నిర్మాణమా?**

రాచకొండ కొత్త కమిషనరేట్ భవన నిర్మాణానికి రూ.లక్ష మాత్రమే ప్రతిపాదించారు. కమిషనరేట్ ఏర్పాటై 8 ఏళ్లవుతున్నా ప్రధాన కార్యాలయం తాత్కాలిక భవనంలోనే కొనసాగుతోంది. మేడిపల్లిలో స్థలం కేటాయించి భవన నిర్మాణం ప్రారంభించినా నిధుల లేమితో పనులు నెమ్మదిగా సాగుతున్నాయి.

**నిఘా నేత్రాలకు రూ.50 కోట్లు**

హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో సీసీటీవీ సర్వైలెన్స్ కోసం ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్‌లో రూ.100 కోట్లు ప్రతిపాదించగా సవరించిన అంచనాల తర్వాత రూ.58.61 కోట్లు కేటాయించింది. సేఫ్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా మహిళా భద్రత(నిర్భయ ఫండ్) కింద రూ.50 కోట్లు కేటాయించింది. వ్యవస్థీకృత నేరాలు, ముఠాలపై పోరాటంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగానికి వీలుగా రూ.18 కోట్లు కేటాయించింది.

**ల్యాండ్ పూలింగ్‌తో..**

ప్రభుత్వ భూముల్లో కూడా టౌన్‌షిప్‌ల అభివృద్ధికి ప్రభుత్వం యోచిస్తోంది. హెచ్ఎండీఏకు మాత్రమే వర్తించేలా 2020లో ప్రభుత్వం 'తెలంగాణ కాంప్రహెన్సివ్ ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ పాలసీ'ని తీసుకొచ్చింది. ఓఆర్ఆర్ దాటి 5 కిలోమీటర్ల తర్వాతే టౌన్‌షిప్ ఉండాలి. ఆ భూమికి భూ వినియోగ మార్పిడి అవసరం లేదు. కనీసం 100 ఎకరాల భూమి ఒకేచోట ఉంటేనే అనుమతులిస్తారు. ప్రభుత్వ భూమి లేకపోతే రైతుల నుంచి సేకరించి అభివృద్ధి చేసి కేటాయించాలి. అంతర్గత రహదారులు 30–60 అడుగులుండాలి. నివాస, వాణిజ్య, విద్యా, ప్రజా అవసరాలు, హెల్త్‌కేర్, మౌలిక వసతులు, ప్రజారవాణా, ఎల్ఐజీ, ఈడబ్ల్యూఎస్ హౌసింగ్, రోడ్లు, పార్కులు, ఆటస్థలాలకు భూ కేటాయింపులు తప్పనిసరి.

# సామర్థ్యాలకు అనుగుణంగా..

## బోధన సాగేలా!

ఖమ్మం : విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు దేశంలోనే అతిపెద్ద సర్వే నవంబరు నుంచి నిర్వహించనున్నారు. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ న్యాస్ (నేషనల్ అఛీవ్‌మెంట్ సర్వే) చేపట్టనుంది. జాతీయ స్థాయిలో విద్యార్థుల జ్ఞానం, అర్థం చేసుకోగలిగే సామర్థ్యాలపై విస్తృత సమాచారం సేకరించనున్నారు. 2017, 2021లో ఈ సర్వే నిర్వహించగా.. ఈ ఏడాది నవంబరులో జరుగుతుంది. దీనికి సంబంధించి ఇటీవల రాష్ట్రస్థాయిలో కార్యశాల నిర్వహించారు. మోడల్ టెస్టు ఐటెమ్స్ తయారు చేశారు. ఈనెల 22న రాష్ట్రంలోని ప్రతి జిల్లా నుంచి ఇద్దరు చొప్పున జిల్లా రిసోర్స్‌పర్సన్లకు రాష్ట్రస్థాయిలో నిపుణులు శిక్షణ ఇచ్చారు. ఇది హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని తెలంగాణ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థలో జరిగింది. రిసోర్స్‌పర్సన్లు తమ జిల్లాల్లో ఈనెల 26, 27 తేదీల్లో జరిగే శిక్షణలో పాల్గొంటారు. ఈ శిక్షణకు ప్రతి స్కూల్ కాంప్లెక్స్ నుంచి ఇద్దరు రిసోర్స్‌పర్సన్‌లు హాజరవుతారు. వారు 30, 31 తేదీల్లో జరిగే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఉపాధ్యాయులకు



తర్ఫీదు ఇస్తారు. తర్వాత ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని తమ పాఠశాలల్లో దీనిని ఎలా అమలుచేయాలో ప్రణాళిక రూపొందిస్తారు.

సర్వే నిర్వహించే పాఠశాలలు

ప్రభుత్వ, ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్, గుర్తింపు పొందిన ప్రైవేటు, కేంద్ర ప్రభుత్వ నవోదయ, ఆదర్శ పాఠశాలల్లో సర్వే నిర్వహించనున్నారు. 3వ తరగతి భాష, గణితం, ఈవీఎస్, 6వ తరగతికి భాష, గణితం, సైన్స్, సాంఘికశాస్త్రం, 9వ తరగతికి భాష, గణితం, సైన్స్, సాంఘికశాస్త్రం, ఆంగ్లం సబ్జెక్టులపై సర్వే నిర్వహిస్తారు. 2017లో 3, 5, 8 తరగతులకు సర్వే జరపగా.. 2021లో 3, 5, 8, 10 తరగతులకు నిర్వహించారు. ఈ ఏడాది 3, 6, 9 తరగతులకు సర్వే జరగనుంది. న్యాస్ పరిశోధనలు విద్యార్థుల అభ్యాసన అంతరాలను నిర్ధారించడంలో సహాయపడతాయి. విద్యా విధానాలు, బోధనా పద్ధతులు, అభ్యాసంలో అవసరమైన మార్పులు తీసుకురావచ్చు. న్యాస్ పరిశోధనలు అధికారులు, ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఉపయోగపడతాయి. పెసర ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర రిసోర్స్‌పర్సన్

# సాగు ప్రశ్నార్థకం..!

మాగనూరు : చిట్టెం నర్సిరెడ్డి రిజర్వాయరు లోలెవల్ కాలువకు అదును దాటుతున్నా నీరు వదలడం లేదు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైంది. ఆగస్టు నాటికి వరినాట్లు పడాలి. కాగా కుడి లోలెవల్ కాలువ కింద ఇప్పటి వరకూ నీరు వదల్లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. లోలెవల్ కుడి కాలువ కింద నేరేడ్‌గం మొదలుకొని వర్క్కూరు, మాగనూరు, అచ్చంపేట, పెగడబండ, అడవిసత్యవార్ రైతులు ఆధారపడి ఉన్నారు. ఏళ్లుగా సేవలందిస్తున్న ఈ కాలువకు ఇంత వరకూ లైనింగ్ ఏర్పాటు చేయలేదు. దీంతో ఎక్కడికక్కడ జమ్ము మొలచి నీరు దిగువకు రావడం లేదు. దీంతో ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారుతోంది.

కాలువ నిర్వహణలో లోపం..

లోలెవల్ కాలువ నిర్వహణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. చాలా మంది రైతులు పంటల సాగు ఆరంభంలో మాత్రమే కాలువ రావడం లేదని ఆందోళన చేస్తున్నారు. కాలువ నిర్వహణ ఎవరు చూస్తున్నారన్నది ఎవరూ పట్టించుకోవడం లేదు. లోలెవల్ కాలువకు ఇప్పటి వరకూ లైనింగ్ చేయని విషయం అందరికీ తెలిసిందే. కాలువ మరమ్మతులు చేయడానికి ఎవరూ ముందుకు రాకపోవడం వల్ల ఈ ఏడాది ఇప్పటి వరకూ కాలువకు నీరు వదల్లేదని స్పష్టమవుతోంది. రైతులందరూ కలిసి కాలువ మరమ్మతులు చేసుకుంటే తప్ప నీరు వదల్లేని పరిస్థితి నెలకొంది.

అధికారులు అంతంత మాత్రమే..

చిట్టెం నర్సిరెడ్డి రిజర్వాయరు కింద కుడి లోలెవల్, ఎడమ లోలెవల్ కాలువలు ఉన్నాయి. ఒక కాలువ 19 కి.మీ మరో కాలువ 20 కి.మీ పరిధిలో సాగు నీరు అందిస్తున్నాయి. వీటి నిర్వహణకు ఒక డీఈ ఒక ఏఈ ముగ్గురు లష్కర్లు మాత్రమే ఉన్నారు. రైతులతో కమిటీ



ఏర్పాటు చేసి కాలువ పరిశీలనకు మరి కొంత మందిని నియమించి చివరి ఆయకట్టు వరకూ నీరందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

రైతులంతా కలసి కాలువ పూడిక తీయించాం

– పవన్ మాగనూరు యువ రైతు

గతంలో రైతులంతా కలసి కాలువ పూడిక తీయించాం. జులై మొదటి వారంలో నారు మడులు పోయాలి. కాగా ఈ ఏడాది ఇంతవరకూ కాలువ వదల్లేదు.వర్క్కూరు శివారులో కాలువ తెగిపోయింది. ఇంతవరకూ మరమ్మతులు చేయలేదు. చాలా వరకూ కాలువకు ముందు ఉన్న రైతులకు నీరందుతుంది. చివరికి వచ్చే సరికి నీరు రావడం లేదు. రైతులతో కమిటీ ఏర్పాటు చేసి లష్కర్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

లైనింగ్ కోసం ప్రతిపాదనలు పంపించాం..

–ఏఈ బలరాం, చిట్టె నర్సిరెడ్డి రిజర్వాయరు

కుడి లోలెవల్ కాలువ కింద ఆయకట్టు చాలా ఉంది. ఇంతవరకూ ఎన్ని ఎకరాలన్నది నిర్ధారణ కాలేదు. ప్రధానంగా కాలువ లైనింగ్ లేకపోవడంతో పెద్ద వర్షాలు వచ్చినప్పుడు కాలువ తెగిపోతుంది. ఇటీవల వర్క్కూరు శివారులో కాలువ తెగి గండి పడింది. నిధులు లేక మరమ్మతు చేయలేదు. వెంటనే కాలువ మరమ్మతులు చేయించి నీరు వదిలే ఏర్పాటు చేస్తాం. కాలువ లైనింగ్‌కు ప్రతిపాదనలు పంపించాం. రైతులకు ఆయకట్టుపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం.




చండీగఢ్: హరియాణా అసెంబ్లీ ఎన్నికలవేళ అక్కడ కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకొంటున్నాయి. భాజపాను ఓడించడమే లక్ష్యంగా కాంగ్రెస్–ఆప్ కలిసి పోటీ చేసేందుకు పలుమార్లు చర్చలు జరగ్గా.. సీట్ల సర్దుబాటు వ్యవహారంలో నెలకొన్న ప్రతిష్టంభన ఆ ప్రక్రియకు అడ్డంకిగా మారింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఆప్ కీలక నిర్ణయం తీసుకుంది. 20 మంది అభ్యర్థులతో తొలి జాబితాను సోమవారం మధ్యాహ్నం ప్రకటించింది. దీంతో హరియాణా ఎన్నికల్లో కాంగ్రెస్–ఆప్ మధ్య పొత్తుపై నీలినీడలు కమ్ముకొన్నాయి. హరియాణాలో అక్టోబర్ 5న ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు నామినేషన్లు వేసేందుకు గడువు సెప్టెంబర్ 12వరకే ఉంది. అయితే, ఇరు పార్టీల మధ్య ఇప్పటివరకు సీట్ల కేటాయింపు వ్యవహారంపై స్పష్టత రాలేదు. దీంతో 20మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసిన ఆప్.. తమ పార్టీ హరియాణా ఉపాధ్యక్షుడు అనురాగ్ ధండాను కలయాత్ సీటు నుంచి బరిలోకి దించింది .అలాగే, భివానీ నుంచి శర్మ, మేహమ్ సీటు నుంచి వికాశ్ నెహ్రా, రోహ్‌తక్ నుంచి బిజేందర్ హుడాలను బరిలో దించుతున్నట్లు ప్రకటించింది. ఆప్ హరియాణా రాష్ట్ర అధ్యక్షుడు సుశీల్ గుప్తా మాట్లాడుతూ.. ఈ సాయంత్రానికి సీట్ల వ్యవహారం ఖరారు కాకపోతే మొత్తం 90 స్థానాలకు తమ అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామని కూడా ప్రకటించడం గమనార్హం. వచ్చే నెలలో హరియాణా అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. హరియాణాలో మొత్తం 90 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను ఆప్ 10 స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తూ ఆ మేరకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తోంది. కానీ, ఏడు సీట్లు ఇచ్చేందుకు మాత్రమే కాంగ్రెస్ సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇరు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు అంశంపై కాంగ్రెస్ సీనియర్ నేత కె.సి.వేణుగోపాల్, ఆప్ సీనియర్ నేత రాఘవ్ చద్దా ఇప్పటికే పలు దఫాలుగా చర్చలు జరిపారు. కానీ, ఇప్పటివరకు సీట్ల కేటాయింపు అంశం కొలిక్కి రాకపోవడంతో ఆప్ తన అభ్యర్థుల జాబితాను ప్రకటించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## గండ్లు పూడ్చిన చోట కట్ట ఎత్తు పెంచే పనులు వేగవంతం చేశాం: నారా లోకేశ్



అమరావతి : బుడమేరుకు వస్తున్న వరద ఉద్ధృతిపై మంత్రి నారా లోకేశ్ ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో సమన్వయం చేసుకుంటూ పనులు మరింత వేగవంతమయ్యేలా లోకేశ్ చర్యలు చేపట్టారు. యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టడంతో గండ్లు పడిన చోట సీపేజ్ లీకేజీ 500 క్యూసెక్కుల నుంచి 200 క్యూసెక్కులకు వరద నీరు తగ్గిందన్నారు. పూర్తి స్థాయిలో లీకేజీని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంత్రి లోకేశ్ ఆదేశాలతో లీకేజీని అరికట్టేందుకు జియో మెంబ్రేన్ షీట్ వినియోగిస్తున్నారు. సాయంత్రానికి పూర్తి స్థాయిలో లీకేజీని అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. వస్తున్న వరదను అంచనా వేస్తూ గండ్లు పూడ్చిన చోట కట్ట ఎత్తు పెంచే పనులు వేగవంతం చేశారు. ఇప్పటికే గండ్లు పడిన చోట 5.7 మీటర్ల ఎత్తు పెంపును చేపట్టగా.. మరో 0.3 మీటర్ల ఎత్తుకు పెంచితే ప్రస్తుత కట్ట స్థాయికి పనులు పూర్తి అవుతాయి. ఎప్పటికప్పుడు బుడమేరు వద్ద జరుగుతున్న పనులను డ్రోన్ ద్వారా పర్యవేక్షిస్తూ పనులను వేగవంతం చేయడానికి వివిధ శాఖల అధికారులతో లోకేశ్ సంప్రదింపులు జరుపుతున్నారు. మరోపక్క వరద బాధితులకు అందుతున్న సహాయం, నష్ట పరిహారం అంచనాలపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. ఇతర శాఖల మంత్రులతో సమన్వయం చేసుకుంటూ నష్ట పరిహార అంచనా పక్కాగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. మొత్తం 36 మంది ప్రజాప్రతినిధులను నష్టం అంచనా పర్యవేక్షణకు నియమించారు.

## బెంగళూరులో కూర్చొని మాపై బురద జల్లుతున్నారు: చంద్రబాబు



విజయవాడ: ప్రజల కష్టాలు తీర్చేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. తనతో సహా మంత్రులు, అధికారులు బురదలోనే తిరుగుతున్నారని చెప్పారు. విజయవాడలోని వరద ముంపు ప్రాంతాల్లో సోమవారం చంద్రబాబు పర్యటించారు. కబేళా సెంటర్‌లో వరద బాధితులతో మాట్లాడారు. తొమ్మిది రోజులుగా ప్రజలు పడిన బాధలు వర్ణనాతీతమన్నారు. బుడమేరుకు గండ్లు పడినా గత పాలకులు పట్టించుకోలేదని, బుడమేరు ప్రాంతాన్ని కబ్జా చేశారని విమర్శించారు.

“ ప్రభుత్వానికి ఎన్నో కష్టాలు ఉన్నాయి. రూ.పదిన్నర లక్షల కోట్ల అప్పు చేసి జగన్ గద్దె దిగిపోయారు. వచ్చి ఈ బురదలో తిరిగి ఉంటే చేసిన పాపాలు కొంతయినా పోయేవి. కానీ, బెంగళూరులో కూర్చొని మాపై బురద జల్లుతున్నారు. ఇంత పెద్ద మహా యజ్ఞంలో ఎన్ని సవాళ్లు ఎదురైనా అధిగమించుకుంటూ ముందుకెళ్తున్నాం. వరదల్లో నష్టపోయిన వారిని అన్ని విధాలుగా ఆదుకుంటాం. వారికి ఆదాయం వచ్చే మార్గాలు కల్పిస్తాం”అని సీఎం అన్నారు.

## బాధితులపై చేయి చేసుకున్న వీఆర్వోపై ప్రభుత్వం సీరియస్.. విధుల నుంచి తొలగింపు



విజయవాడ: వరద బాధితులపై చేయి చేసుకున్న వీఆర్వో జయలక్ష్మి తీరుపై ప్రభుత్వం సీరియస్ అయింది. వీఆర్వోను విధుల నుంచి తప్పిస్తున్నట్లు కృష్ణా జిల్లా కలెక్టర్ సృజన వెల్లడించారు. ఆమెకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు.

బాధితులతో సంయమనంగా వ్యవహరించాలని ఇప్పటికే చంద్రబాబు అధికారులకు సూచించారు. బాధల్లో ఉన్న బాధితులు ఓ మాట అన్నా.. ఓపిగ్గా సమాధానం చెప్పాలని సీఎం ఆదేశాలు ఇచ్చారు. అయినా పలువురు ఉద్యోగుల తీరు మారట్లేదు. దీంతో అలాంటి వారి విషయంలో ప్రభుత్వం కఠిన వ్యవహరిస్తోంది.

**ఏం జరిగిందంటే..?** మంచినీరు, ఆహారం తమ వీధిలోకి అందలేదని విజయవాడలో వరద బాధితులు ప్రశ్నించినందుకు వీఆర్వో జయలక్ష్మి ఒకరి చెంప పగలగొట్టారు. అక్కడితో ఆగకుండా పోలీసులు ముందే బాధితుడిని దుర్భాషలాడారు. నన్నే ప్రశ్నిస్తావా?అంటూ బాధితులపైనే అధికారులకు ఫిర్యాదు చేశారు. భోజనాలు, మంచినీరు అందటం లేదని ప్రశ్నించినందుకు ఇలా ఓ వీఆర్వో, వరద బాధితులపై చేయి చేసుకోవడం వివాదానికి దారి తీసింది.

ఆమె వైఖరిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే ఉన్నతాధికారులు ఆమెపై చర్యలు తీసుకున్నారు.

## ఐదేళ్లు జగన్ టెర్రరిస్ట్‌లా ఏపీని పాలించారు.. మంత్రి మండిపల్లి విసుర్లు



అమరావతి: వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనలో చంద్రబాబు అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తూ.. ఈ రోజును బ్లాక్ డేగా ప్రకటిస్తున్నామని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. మాజీ సీఎం జగన్ రెడ్డి ఒక టెర్రరిస్ట్‌లా గత ఐదేళ్లు ఏపీని పరిపాలించారని విమర్శలు చేశారు. జగన్ రెడ్డి పాలనలో ఎవరికీ నిద్రలేదని ఆరోపించారు. సీఎం చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి కొండను తవ్వి ఎలుకను పట్టుకున్నట్లుగా వ్యవహరించారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విమర్శలు చేశారు. అక్రమంగా చంద్రబాబును 53 రోజులు జైల్లో పెట్టారని అన్నారు. రూ.3000 వేల కోట్ల మోసం అంటూ.. 30 పైసలు కూడా బయట పెట్టలేకపోయారని ఎద్దేవా చేశారు. జగన్ రెడ్డి తన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి ఎవరి మాన ప్రాణాలనైనా తీస్తారని ఆరోపించారు. నాడు పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకుని చట్టాన్ని చుట్టంలా వాడుకున్నారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విమర్శలు చేశారు. నేడు పచ్చకామెర్లోడికి లోకమంతా పచ్చగా కనిపించినట్లు బెంగళూరులో కూర్చుని జగన్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. వరదబాధితులకు సాయం చేయకపోగా.. పిచ్చి ప్రేలాపనలు పేలుతున్నారని విమర్శించారు. చంద్రబాబు చొరవతోనే విరాళాలు ఇవ్వడానికి పలువురు ముందుకు వస్తున్నారని వివరించారు. భారీ వర్షాల సమయంలో యంత్రాంగం చురుగ్గా పనిచేస్తోందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రశంసించారు. కేంద్రమంత్రులు సైతం వచ్చి వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి, బాధితులను పరామర్శించి అండగా ఉంటామని ధైర్యం చెబుతున్నారని అన్నారు. అబద్ధాలను నమ్ముకున్న వైసీపీకి భవిష్యత్ లేదని ఆక్షేపించారు. వైసీపీలో ఆ 11 సీట్లు కూడా పోయి జగన్ ఒక్కడే ఆ పార్టీలో మిగలడం ఖాయమని ఎద్దేవా చేశారు, చంద్రబాబు పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని.. తమ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తున్నామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.




**అమెరికాలోని లూసియానా రాష్ట్రం లేక్ చార్లెస్‌లో 2020లో సంభవించిన లౌరా, డెల్టా హరికేన్‌ల కారణంగా 22 అంతస్తుల హెర్ట్జ్ టవర్ బాగా దెబ్బతింది. ఈ నేపథ్యంలో హెర్ట్జ్ టవర్‌ను అధికారులు శనివారం ఇలా నియంత్రిత విధానంలో పేలుళ్లు జరిపి కూల్చివేశారు. 15 సెకన్లలోనే ఈ భవనం నేలమట్టమైంది.**

## ‘తెలుగుభాష’ ముఖ్యం కాదంటే.. వారిని అవమానించినట్లే: అమెరికాలో రాహుల్ కీలక వ్యాఖ్యలు



అమెరికా పర్యటనలో ఉన్న కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ.. డాలస్‌లోని ప్రవాస భారతీయులతో ముచ్చటించారు. మన దేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తుందన్న ఆయన.. భాషలు, సంప్రదాయాల పేరుతో ఎవర్నీ వేరు చేసి చూడొద్దని అన్నారు. ఈసందర్భంగా తెలుగు భాష గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించడం విశేషం. “భారత జాతీయగీతం అన్ని రాష్ట్రాలను ప్రతిబింబిస్తుంది. సమానంగా చూపిస్తుంది. అంతేగానీ.. ఒక రాష్ట్రం బెస్ట్.. మరో రాష్ట్రం సెకండ్ బెస్ట్ అని అందులో ఎక్కడా ఉండదు. ఈ గీతం మన దేశాన్ని రాష్ట్రాల సమాఖ్యగా చెబుతుంది. అప్పుడు ఒక రాష్ట్రం కంటే ఇంకో రాష్ట్రం ఎక్కువా కాదు.. తక్కువా కాదు. అలాగే భాష, సంప్రదాయాలు కూడా. తమిళం మాట్లాడేవారు మాకు నచ్చరు అని.. హిందీ మాట్లాడేవారే ఇష్టమని మనం చెప్పడం సరికాదు” అని రాహుల్ వ్యాఖ్యానించారు. “తెలుగునే తీసుకోండి.. మనం తెలుగు అని చెబుతున్నప్పుడు అది కేవలం భాష కాదు.. ఒక చరిత్ర, ఒక సంప్రదాయం, సంస్కృతి. హిందీతో పోలిస్తే తెలుగు భాష అంత ముఖ్యం కాదని ఒకవేళ ఆ రాష్ట్ర ప్రజలకు మీరు చెప్పినట్లయితే.. వారిని మీరు అవమానించినట్లే..! అలా పోలుస్తూ.. తెలుగు చరిత్ర, అక్కడి సంప్రదాయం, సంస్కృతి, పూర్వీకులు ముఖ్యం కాదని మీరు చెప్పినట్లే..!” అని కాంగ్రెస్ ఎంపీ అన్నారు. ఈ చిన్న తేడాను కొందరు అర్థం చేసుకోకపోవడం వల్లే భారత్‌లో దీనికోసం పోరాటం జరుగుతోందంటూ భాజపాపై రాహుల్ విమర్శలు గుప్పించారు.

## పూరీ వద్ద తీరం దాటిన తీవ్ర వాయుగుండం



పూరీ: వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తీరం దాటినట్లు ఐఎండీ వెల్లడించింది. ప్రస్తుతం పూరీకి వాయవ్య దిశగా పయనిస్తోందని, దీని ప్రభావం రాత్రి 7.30 వరకు కొనసాగుతుందని తెలిపింది. ఛత్తీస్‌గఢ్ దిశగా పయనించి క్రమంగా బలహీనపడుతుందని ఐఎండీ పేర్కొంది. తీవ్ర వాయుగుండం ప్రభావం వల్ల ఒడిశాలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మాల్కాన్‌గిరిలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఒడిశా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహూజా భువనేశ్వర్‌లో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రిలీఫ్ కమిషనర్ డి.ఆర్.సింగ్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో వరదలు వచ్చే అవకాశం లేదని చెప్పారు. తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఏపీలో చాలా చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. మరోవైపు తీవ్ర వాయుగుండం ప్రభావం వల్ల తెలంగాణలోనూ సోమవారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. కొన్ని జిల్లాల్లో రెండు రోజుల పాటు అక్కడక్కడా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు తెలిపింది. మంగళవారం కొన్ని జిల్లాల్లో 30కి.మీ నుంచి 40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశమున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్ర సంచాలకులు పేర్కొన్నారు.




## సుప్రీంను ఆశ్రయించిన అవినాశ్.. బెయిల్ వస్తుందా?

అమరావతి/న్యూ ఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనం సృష్టించిన టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో ఇప్పటికే పలువురు అరెస్ట్ అయిన సంగతి తెలిసిందే. ఇక మిగిలింది పెద్ద తలకాయలు మాత్రమే.. ఇందులోనూ ఇద్దరు ముగ్గురు అరెస్ట్ కాగా.. మరికొందరి కోసం పోలీసులు వేట సాగిస్తున్నారు. అయితే.. అరెస్ట్ నుంచి తప్పించుకోవాలని వైసీపీ యువనేత దేవినేని అవినాశ్ విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే విదేశాలకు పారిపోతుండగా.. హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో పోలీసులు పట్టుకున్న సంగతి తెలిసిందే. ఆ తర్వాత బెయిల్ కోసం ఏపీ హైకోర్టును ఆశ్రయించడం.. న్యాయస్థానం నిరాకరించడంతో ఇక దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

**ఊరట దక్కేనా..** ముందస్తు బెయిల్ కోరుతూ సుప్రీంకోర్టులో దేవినేని అవినాశ్ పిటీషన్ దాఖలు చేశారు. ఇప్పటికే ఏపీ హైకోర్టు ముందస్తు బెయిల్‌ను నిరాకరించడంతో.. సుప్రీంకోర్టులో అయినా ఊరట దక్కుతుందేమోనని అవినాశ్ ఆశలు పెట్టుకున్నారు. సుప్రీంను ఆశ్రయించడంతో.. ఏపీ హైకోర్టు తీర్పును సుప్రీంలో సవాలు చేసినట్లు అయ్యింది. ఇదివరకే.. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో ముందస్తు బెయిల్ కోసం వైసీపీ నేతలు దేవినేని అవినాశ్, తలశీల రఘురాం, మాజీ ఎంపీ నందిగం సురేశ్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డితో పాటు పలువురు హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. అయితే.. ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు ససేమిరా అనడంతో.. ఈ తీర్పును సుప్రీంలో సవాలు చేస్తూ అవినాశ్ పిటిషన్ దాఖలు చేశారు. మంగళవారం నాడు ఈ పిటిషన్ సుప్రీంకోర్టులో విచారణకు వచ్చే అవకాశం ఉంది. ఇక్కడైనా ఊరట దక్కుతుందో లేదో చూడాలి.

**హైకోర్టు ఏం చెప్పింది..? :** టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి, చంద్రబాబు నివాసంపై దాడి కేసుల్లో అరెస్ట్ నుంచి రక్షణ కల్పించేందుకు వైసీపీ నేతలకు హైకోర్టు నో చెప్పేసింది. ఈ కేసులో ప్రమేయం ఉన్న వైసీపీ నేతలకు ముందస్తు బెయిల్ ఇచ్చేది లేదని హైకోర్టు స్పష్టం చేసింది. అరెస్ట్ నుంచి రక్షణ కల్పించే ప్రసక్తే లేదని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో దేవినేని అవినాష్, అప్పిరెడ్డి, నందిగాం సురేష్, తలశిల రఘురామ్‌తో పాటు 14 మందికి బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నో చెప్పింది.

ఇక చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో జోగి రమేష్‌కు బెయిల్ తిరస్కరించింది ధర్మాసనం. హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో వీరందరినీ పోలీసులు అరెస్ట్ చేసే అవకాశం ఉంది. కాగా.. తెలుగుదేశం కేంద్ర కార్యాలయంపై దాడి కేసు వైసీపీ నేతల మెడకు చుట్టుకుంది. 2021 అక్టోబర్ 19వ తేదీ సాయంత్రం వైసీపీ నేతలు విజయవాడలో టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పట్టాభి ఇంటితోపాటు తెలుగుదేశం కేంద్ర కార్యాలయంపై దాడులు చేసి వీరంగం సృష్టించారు. ఈ దాడుల దృశ్యాలు టీడీపీ కార్యాలయంలోని సీసీటీవీ పుటేజీలో రికార్డు అయ్యాయి. అప్పట్లో కార్యాలయంపై దాడికి నిరసనగా చంద్రబాబు రెండు రోజులపాటు మౌన దీక్ష కూడా చేశారు. ఆ తర్వాత రాష్ట్రపతికి కూడా ఫిర్యాదు చేయడం జరిగింది. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కేసును మళ్లీ ఓపెన్ చేయడంతో అరెస్టుల పర్వం కొనసాగుతోంది.

# ఎర్రటి చీరలో కుమారి పాప.. స్టన్నింగ్!

తెలుగు సినిమా ఇండస్ట్రీలో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న నటి హెబ్బా పటేల్. స్టార్ హీరోయిన్ ట్యాగ్ ను దక్కించుకోకపోయినా, యూత్ లో ఆమెకు ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కుమారి 21 ఎఫ్ సినిమాలో తన ఆకర్షణీయమైన అభినయంతో అందరినీ ఆకట్టుకుని, కుర్రకారును ఫిదా చేసింది. ఆ సినిమా తర్వాత వరుస ఆఫర్లు వచ్చినా, బిగ్ హిట్స్ సాధించడంలో తడబడింది. అయితే ఈడో రకం ఆడో రకం, ఎక్కడికి పోతావు చిన్నవాడ, నాన్న నేను నా బాయ్ ఫ్రెండ్స్, అందగాడు, మిస్టర్, 24 కిస్సెస్ వంటి చిత్రాల్లో తన నటనలో ఉన్న వైవిధ్యాన్ని చూపించింది. ఇటీవల ఓదెల రైల్వే స్టేషన్ సినిమాతో మంచి హిట్ అందుకోవడంతో, ఆడియన్స్ మళ్లీ ఆమె వైపు చూస్తున్నారు. అలాగే, గీత, శాసనసభ, హనీమూన్ ఎక్స్‌ప్రెస్ సినిమాలతో కూడా మంచి గుర్తింపు పొందింది.



సినిమాలతో బిజీగా గడుపుతున్నా కూడా హెబ్బా సోషల్ మీడియాలో మరింత యాక్టివ్ గా ఉంటుంది. ప్రతి రోజూ తన పర్సనల్ లైఫ్, సినిమా అప్‌డేట్స్ పిక్స్, వీడియోలతో అభిమానులను ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా తన అందం, ఫ్యాషన్ స్టేట్మెంట్‌తో ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకుంది. రకరకాల డ్రెస్సుల్లో స్టైలిష్ ఫొటోషూట్స్ చేస్తూ, ఆ ఫోటోలను తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తుంది. తాజాగా పంచుకున్న పిక్స్ తో మరోసారి నెటిజన్లను ఆకట్టుకుంది. ఎర్రటి చీరలో తన అందాన్ని నాజూకుగా ప్రదర్శిస్తూ, డీసెంట్ గా కనిపిస్తూ మైమరిపించింది. ఈ పిక్స్ క్షణాల్లో వైరల్ అవ్వడంతో అభిమానులు లైకులు కొడుతూ కామెంట్స్ పెడుతున్నారు. హెబ్బా ఇలాంటి పిక్ షేర్ చేసినప్పుడల్లా నెటిజన్లు, అభిమానులు తెగ హుషారుగా స్పందిస్తుంటారు. ఇలా సోషల్ మీడియాలో హెబ్బా పటేల్ తన స్టైలిష్ అవతారాలతో ఎప్పటికప్పుడు ఫాలోవర్స్ ను పెంచుకుంటోంది.

# లవ్ రొమాన్స్ అంటే షారూఖ్ అయి ఉండాలి: మను భాకర్

ఒలింపిక్స్ 2024లో మొదటి మెడల్ సాధించిన క్రీడాకారిణిగా మను బాకర్ రికార్డులకెక్కిన సంగతి తెలిసిందే. భారతదేశానికి గర్వించదగిన విజయాన్ని అందించింది. ఒలింపిక్ పతకం అందుకున్న తర్వాత దేశంలో తనకు ఫాలోయింగ్ పెరిగింది. అలాగే మను బ్రాండ్ వ్యాల్యూ అమాంతం పెరిగడంతో ఆదాయం గ్రాఫ్ పెరిగింది. ఇప్పుడు కౌన్ బనేగా కరోడ్‌పతి 13లో మను భాకర్ కనిపించింది. బాలీవుడ్‌పై తనకున్న అభిమానం గురించి షో హోస్ట్ అమితాబ్ బచ్చన్‌తో మాట్లాడింది. క్రీడలతో పాటు సినిమాపై తన ప్రేమను కూడా వ్యక్తం చేసింది. ప్రేమ, శృంగార రసం విషయానికి వస్తే షారుక్ ఖాన్ లా ఇంకెవరూ చేయలేరని మను ప్రశంసించారు.




ప్రేమ – రొమాన్స్ లో అది షారుఖ్ ఖాన్ అయి ఉండాలి! అని ఆమె సమాధానం ఇచ్చింది. ఆమె సమాధానంపై అమితాబ్ స్పందిస్తూ– మేడమ్, నేను నా సినిమాల్లో సరిపడినంత ప్రేమ కథలు, శృంగారం కూడా చేశాను అని పేర్కొన్నాడు. అహూతులంతా పగలబడి నవ్వుతుండగా మను .. సర్ ప్రశ్నకు ఇచ్చిన ఆప్షన్లలో మీ పేరు లేదు కదా! అన్నారు. మొహబ్బతీన్ సినిమా నుంచి ఒక డైలాగ్ కూడా వినిపించి అమితాబ్ మనసును గెలుచుకున్నారు మను. నాగ్ అశ్విన్ డిస్టోపియన్ యాక్షన్–థ్రిల్లర్ కల్కి 2898 ADలో నటించిన అమితాబ్, 2025లో సీక్వెల్ లోను నటిస్తారని కథనాలొచ్చాయి. ఈ సైన్స్–ఫిక్షన్ చిత్రంలో ప్రభాస్, దీపికా పదుకొనే, కమల్ హాసన్, దిశా పటానీ, శోభన, శాశ్వత చటర్జీ తదితరులు నటించారు. ఈ చిత్రం హిందీలో నెట్‌ఫ్లిక్స్‌లో..ఇతర ప్రాంతీయ భాషల్లో ప్రైమ్ వీడియోలో ప్రసారం అవుతోంది. ఆర్ బాల్కీ ది ఇంటర్న్ అనుసరణలోను అమితాబ్ నటిస్తున్నారు. ఇందులో దీపికతో కలిసి నటించనున్నాడు.




# శంకర్ ని నమ్మని నిర్మాతలు..?




సౌత్ స్టార్ డైరెక్టర్స్ లో ఒకప్పుడు టాప్ 1 లో ఉన్న శంకర్ ఇప్పుడు సక్సెస్ కోసం చాలా కష్టపడుతున్నారు. ఎప్పుడో పది పదిహేనేళ్ల క్రితమే తన కంటెంట్ తో పాన్ ఇండియా లెవెల్ లో సంచలన విజయాలు అందుకున్న శంకర్ ఈమధ్య వరుస ఫ్లాపులతో ఫాం కోల్పోయారు. ఎన్నో భారీ అంచనాలతో వచ్చిన ఇండియన్ 2 సినిమా కూడా నిరాశ పరచడంతో శంకర్ సినిమా అంటే బాబోయ్ అనే పరిస్థితి వచ్చింది.

ఐతే ప్రస్తుతం శంకర్ చరణ్ హీరోగా గేం చేంజర్ సినిమా చేస్తున్నారు. దిల్ రాజు నిర్మాతగా తెరకెక్కుతున్న ఈ సినిమా కొన్నాళుగా సెట్స్ మీద ఉంది. సినిమా రిలీజ్ ఎప్పుడంటూ మెగా ఫ్యాన్స్ ఎంత ఎటాక్ చేస్తున్న చిత్ర యూనిట్ మాత్రం అసలేమాత్రం రెస్పాండ్ అవ్వట్లేదు. అప్పుడెప్పుడో జరగండి సాంగ్ ఒకటి వదిలారు ఆ తర్వాత సినిమా నుంచి ఎలాంటి అప్డేట్ రాలేదు. ఐతే ఓ పక్క నిర్మాత దిల్ రాజు గేమ్ చేంజర్ క్రిస్మస్ రేసులో ఉంటుందని అంటున్నా కూడా సినిమాను కచ్చితంగా ఆ డేట్ కి పూర్తి చేస్తారా అన్న డౌట్ ఉంది. అందుకే నేడు వినాయక చవితి సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్ లో సెకండ్ సింగిల్ సెప్టెంబర్ లో ఉంటుందని అనౌన్స్ చేశారు. ఐతే ఎలాగు క్రిస్మస్ కి రిలీజ్ అనుకుంటున్నారు కదా అని డేట్ వేస్తారేమో అనుకుంటే అది మాత్రం రివీల్ చేయలేదు. అంటే శంకర్ సినిమాను డిసెంబర్ కల్లా కూడా పూర్తి చేస్తాడో లేదో అన్న అపనమ్మకం నిర్మాతలకు ఉందని తెలుస్తుంది. ఓ పక్క మెగా ఫ్యాన్స్ మాత్రం శంకర్ అండ్ గేం చేంజర్ టీం మీద చాలా ఫైర్ అవుతున్నారు. గేం చేంజర్ సినిమా లో కియరా అద్వాని హీరోయిన్ గా నటిస్తుంది. థమన్ మ్యూజిక్ అందిస్తున్న ఈ సినిమాలో ఎస్ జే సూర్య, శ్రీకాంత్, సునీల్ లాంటి స్టార్స్ కూడా ఉన్నారు. గ్లోబల్ స్టార్ ఇమేజ్ తెచ్చుకున్న చరణ్ గేమ్ చేంజర్ తో మరో సూపర్ హిట్ కొట్టాలని చూస్తున్నారు. ఈ సినిమా బిజినెస్ లెక్కలు మెగా ఫ్యాన్స్ ని ఖుషి చేస్తున్న సినిమా లేట్ అవుతున్నందుకు మాత్రం చాలా అప్సెట్ అవుతున్నారు.

# మత్తు వదలరా-2 ట్రైలర్.. ఎలా ఉందంటే?




స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎం ఎం కీరవాణి కుమారుడు శ్రీసింహా, కమెడియన్ సత్య లీడ్ రోల్స్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ మత్తు వదలరా 2. 2019లో థియేటర్లలోకి వచ్చి సూపర్ హిట్ అయిన మత్తు వదలరాకు సీక్వెల్ గా ఆ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. రితేష్ రానా దర్శకత్వం వహిస్తున్న మత్తు వదలరా–2.. క్రైమ్ కామెడీ జోనర్ లో ఆడియన్స్ ను అలరించనుంది. జాతిరత్నాలు ఫేమ్ ఫరియా అబ్దుల్లా ఫిమేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. ఇప్పటికే ఈ మూవీపై ఆడియన్స్ లో భారీ అంచనాలు నెలకొన్నాయి. టీజర్, సాంగ్స్, పోస్టర్స్ మంచి రెస్పాన్స్ అందుకున్నాయి. సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ చేశాయి. సెప్టెంబర్ 13వ తేదీన మత్తు వదలరా సీక్వెల్ రిలీజ్ కానున్నట్లు ఇటీవల అనౌన్స్మెంట్ వచ్చిన విషయం తెలిసిందే. అయితే రిలీజ్ డేట్ దగ్గర పడుతుండడంతో మేకర్స్ ప్రమోషన్స్ లో స్పీడ్ పెంచారు. తాజాగా మూవీ ట్రైలర్ ను పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ విడుదల చేశారు. బయటకు రారా నీతి మాలిన కుక్క అనే బ్యాక్ గ్రౌండ్ డైలాగ్ తో ట్రైలర్ ప్రారంభమైంది. ఆ తర్వాత శ్రీసింహ, సత్యను రివీల్ చేశారు మేకర్స్. హెచ్‌ఈ టీమ్‌లో స్పెషల్ ఏజెంట్లుగా పనిచేస్తున్న వారిద్దరూ కిడ్నాపర్‌ల నుంచి డబ్బులు తీసుకుంటారు. అనుకోకుండా వారిలో ఒకరు చనిపోతారు. దీంతో చాలా భయపడతారు. ఆ తర్వాత ఏం జరిగింది? చివరకు ఏమైంది? అనేది మొత్తం సినిమాగా ట్రైలర్ చూస్తుంటే తెలుస్తోంది. అయితే సీక్వెల్ కోసం క్రేజీ కాన్సెప్ట్ ను రితేష్ సెలెక్ట్ చేసుకున్నట్లు క్లియర్ గా అర్థమవుతోంది. ఆయన రాసుకున్న ప్రతి రోల్ కూడా సినిమాకు కీలకంగా అనిపిస్తోంది. స్టోరీ స్పీడ్ గా ఉంటూ.. క్రేజీగా అలరిస్తోంది. నెరేషన్ స్పెషల్ అట్రాక్టివ్ గా నిలుస్తుంది. డ్రగ్స్ అంశం యూనిక్ ట్విస్ట్ గా అనిపిస్తోంది. శ్రీసింహా, సత్య రోల్స్ ఫుల్ ఎంటర్టైనింగ్ గా ఉన్నాయి. ఫరియా, సునీల్, అజయ్ పాత్రలు.. మూవీకి మరింత అసెట్ గా మారినట్లు కనిపిస్తున్నాయి. ఓవరాల్ గా ట్రైలర్ ఫన్ ఎలిమెంట్స్ తో పాటు క్రైమ్ అంశాలతో అందరినీ ఆకట్టుకుంటోంది. సినిమాటోగ్రాఫర్ సురేష్ సారంగం, సంగీత దర్శకుడు కాల భైరవ, ఎడిటర్ కార్తీక శ్రీనివాస్ ఆర్.. ముగ్గురూ కలిసి తమ వర్క్ తో ట్రైలర్ ను ఆకర్షణీయంగా మార్చారు. మూవీని కూడా అంతే రీతిలో ప్రజెంట్ చేయనున్నట్లు తెలుస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై చిరంజీవి(చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మిస్తున్న మత్తు వదలరా–2 ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

# ఎర్ర కోకలో బజ్జీల పాప.. ఒక్కో సెల్ఫీ అదుర్స్ అంతే!

బజ్జీల పాప.. అదేనండీ తెలుగు అమ్మాయి కుషిత కల్లపు.. సోషల్ మీడియా ద్వారా ఫుల్ పాపులారిటీ సంపాదించుకున్న అమ్మడు.. ఆ క్రేజ్ తో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. పలు చిత్రాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా నటించిన కుషిత.. ఒక్క డ్రగ్స్ కేసుతో రెండు తెలుగు రాష్ట్రాల్లో వైరల్ అయిపోయింది. పబ్ కు వెళ్లింది.. డ్రగ్స్ తీసుకోవడానికి కాదు.. చీజ్ బజ్జీలు తినడానికి అని చెప్పింది. దీంతో బజ్జీల పాపగా ఆమె పేరు మారింది! ఆ తర్వాత ఇన్ స్టాగ్రామ్ ఇన్ఫ్లుయెన్సర్ గా సూపర్ క్రేజ్ సంపాదించుకుంది. అనేక షార్ట్ ఫిల్మ్స్ లో నటించింది. చాంగురే బంగారు రాజా, మనోహరం సినిమాల్లో హీరోయిన్ గా యాక్ట్ చేసింది. గత ఏడాది నీతోనే నేను, అడ్డతీగల చిత్రాల్లో నటించింది. పెళ్లి కూతురు పార్టీ సినిమాలో మెరిసింది. రీసెంట్ గా బిగ్ బాస్ ఫేమ్ అర్జున్ కళ్యాణ్ తో కలిసి బాబు నెంబర్ 1 బుల్ షిట్ గాయ్ సినిమా చేసింది. కానీ అనుకున్న స్థాయిలో హిట్స్ సాధించలేకపోయింది. అయితే సూపర్ స్టార్ మహేష్ బాబు గుంటూరు కారం మూవీలో నటించే ఛాన్స్ అందుకుంది కుషిత. నాలుగు రోజులపాటు షూట్ కు వెళ్లింది. కానీ సినిమా రిలీజ్ అయ్యాక ఆమె కనిపించలేదు. ఈ విషయంపై ఆమెనే తర్వాత క్లారిటీ ఇచ్చింది.



తాను చేసిన సీన్స్ ఎడిటింగ్ లో తొలగించినట్లు తెలుసుకున్నానని తెలిపింది. కాస్త బాధపడినా.. ఇలాంటివి కామన్ కదా అని చెప్పింది. ఇప్పుడు మంచి సినిమా అవకాశాలు అందుకోవాలని చూస్తోంది. అదే సమయంలో నెట్టింట తన అందచందాలతో ఆకట్టుకుంటోంది. ఎప్పటికప్పుడు చీరల్లో అందాలు ఆరబోస్తూ ఫిదా చేస్తుంటుంది. ప్లెయిన్ కలర్ శారీల్లో క్యూట్ గా కనిపిస్తూ ఫ్లాట్ చేస్తుంటుంది. జిమ్ చేస్తున్న పిక్స్ షేర్ చేస్తుంటుంది. మోడ్రన్ డ్రెస్సుల్లో కూడా ఫోటో షూట్ పోస్ట్ చేస్తూ మైమరపిస్తుంటుంది. అలా ఎప్పుడూ ట్రెండింగ్ లోనే ఉంటుంది. తాజాగా కొత్త పిక్స్ పోస్ట్ చేసింది. ట్రెడిషనల్ గా, హోమ్లీగా కుషిత కల్లపు సందడి చేసింది. రెడ్ కలర్ శారీలో సంప్రదాయంగా రెడీ అయ్యి వరుసగా తీసుకున్న సెల్ఫీలు షేర్ చేసింది. హెవీ నెక్ సెట్ వేసుకున్న అమ్మడు.. జడకు మల్లెపూలు పెట్టుకుంది. ఒక్కో సెల్ఫీలో ఒక్కో ఎక్స్ప్రెషన్ ఇస్తూ ఆకట్టుకుంటుంది. కొంటెగా.. ముద్దుగా.. క్యూట్ గా.. అమాయకంగా.. కామెడీగా.. కుషిత ఇచ్చిన పోజులు ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారాయి. బజ్జీల పాప పిక్స్ అదిరిపోయాయని, ఫ్లాట్ అయ్యామని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు

# శ్రీలీల అలా చేయడమే సేఫ్.. లేకుంటే..

యంగ్ హీరోయిన్ శ్రీలీల.. తన అందం, అభినయంతో ఓ రేంజ్ లో ఫ్యాన్ బేస్ ను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. తన డ్యాన్స్ మూవ్స్ తో సినీ ప్రియులను తెగ్గ మెప్పించింది. ఆమె డ్యాన్స్ లో స్పెషల్ గ్రేస్ కనిపిస్తుందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. అయితే ఇప్పుడు తన టాలెంట్ ను అన్ని ఇండస్ట్రీలకు పరిచయం చేయాలని చూస్తోంది శ్రీలీల. బాలీవుడ్ తోపాటు కోలీవుడ్ లో అడుగుపెట్టేందుకు గ్రాండ్ గా రంగం సిద్ధం చేసుకుంటోంది. టాలీవుడ్ లో వరుస ఫ్లాపులు ఎదుర్కొన్నా.. ఆమెకు ఉన్న క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు. చిన్న బ్రేక్ తీసుకున్న అమ్మడు.. ఇప్పుడు మళ్లీ బిజీ బిజీగా గడుపుతోంది. సరైన కథలు ఎంచుకునే దిశగా అడుగులు వేస్తోంది. తెలుగులో ప్రస్తుతం మూడు సినిమాల్లో నటిస్తోంది అమ్మడు. యంగ్ హీరో నితిన్ సరసన రాబిన్ హుడ్ మూవీలో యాక్ట్ చేస్తోంది. ఆమె రోల్ కు సంబంధించిన గ్లింప్స్.. మేకర్స్ రీసెంట్ గా రిలీజ్ చేయగా ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. మాస్ మహారాజా రవితేజ ల్యాండ్ మార్క్ 75వ చిత్రంలో యాక్ట్ చేస్తోంది శ్రీలీల. పవన్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాలో కూడా ఆమెనే హీరోయిన్ అయినప్పటికీ.. ప్రస్తుతం ఆ మూవీ షూటింగ్ హోల్డ్ లో ఉంది.



అయితే ఇప్పుడు సోషల్ మీడియాలో ఓ విషయం వైరల్ గా మారింది. రీసెంట్ గా వచ్చిన ఓ సినిమాను రిజెక్ట్ చేసి శ్రీలీల మంచి పని చేసిందని ఫ్యాన్స్ చెబుతున్నారు. లేకుంటే మరో ఫ్లాప్ తన ఖాతాలో వేసుకునేదని అంటున్నారు. ఆ సినిమా ఏంటంటే.. విజయ్ దళపతి ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్– ది గోట్. రీసెంట్ గా ప్రేక్షకుల ముందుకు వచ్చిన గోట్ మూవీలో సీనియర్ నటి త్రిష ఓ స్పెషల్ సాంగ్ చేసిన విషయం తెలిసిందే. ఆ పాట అంతగా హిట్ అవ్వలేదు.. మూవీ రిజల్ట్ కూడా అలానే ఉంది. అయితే ఆ సాంగ్ ఆఫర్ ముందు శ్రీలీల వద్దకు వచ్చింది. కానీ ఆమె రిజెక్ట్ చేసింది. స్టార్ హీరో సినిమా కదా అని వెంటనే యాక్సెప్ట్ చేయకుండా.. కాస్త ఆలోచించి ఆఫర్ ను వదులుకుంది. గోట్ మేకర్స్.. ఆమెకు భారీ రెమ్యునరేషన్ ఇస్తామన్నా కూడా శ్రీలీల రిజెక్ట్ చేసినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఐటెం సాంగ్ చేస్తే.. మళ్లీ సినీ ప్రియుల్లో వేరేలా ముద్రపడుతుందని ఆలోచించిందేమో! అందుకే ఆ సాంగ్ కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. అయితే మెగాస్టార్ చిరంజీవి అప్ కమింగ్ మూవీ విశ్వంభరలోని ప్రత్యేక గీతం కోసం కూడా మేకర్స్ ఆమెను ఇటీవల సంప్రదించారట. ఆ ఆఫర్ నూ శ్రీలీల రిజెక్ట్ చేసినట్లు సమాచారం.

# సెలక్షన్లు, కలెక్షన్లు చేసి త్యాగమని చెప్పుకొంటున్నారు: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: కేసీఆర్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ నిలువ నీడ ఇచ్చారని సీఎం రేవంత్ తెలిపారు. నాంపల్లిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని(ఐఐహెచ్‌టీ) వర్చువల్‌గా ప్రారంభించారు. లలిత కళాతోరణంలో ఇందుకు సంబంధించిన ప్రారంభోత్సవం నిర్వహించారు. చేనేత అభయహస్తం లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ కార్యాలయం ఏర్పాటుకు కొండా లక్ష్మణ్ బాపూజీ స్థలం ఇచ్చారన్నారు. తెలంగాణ కోసం పదవులను తృణప్రాయంగా వదులుకున్నారని చెప్పారు. కానీ కొంత మంది రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలు, ఉపఎన్నికలు తెచ్చారన్నారు. ఆ ఎన్నికల్లో సెలక్షన్లు, కలెక్షన్లు చేసి త్యాగమని చెప్పుకొంటున్నారని విమర్శించారు. గజ్వేల్‌లో ఫాంహౌస్‌లు ఏర్పాటు చేసుకున్నారన్నారు. కేసీఆర్, కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగాలకు తేడా గమనించాలన్నారు. ఉప ఎన్నికల్లో సెలక్షన్లు, కలెక్షన్లతో బాగుపడిందెవరో ప్రజలకు తెలుసన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ ఎప్పుడూ గుర్తిస్తుందని చెప్పారు. ఐఐహెచ్‌టీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టుకుందామన్నారు. ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేయాలని ప్రధాని, కేంద్రమంత్రులను కోరామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. వారు రాజకీయాలకు అతీతంగా ముందుకు వచ్చి తక్షణమే మంజూరు చేశారని చెప్పారు. నాంపల్లి తెలుగు అకాడమీలో ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. "గత ప్రభుత్వ హయాంలో చేనేతల జీవన విధానంలో మార్పులు రాలేదు. సిరిసిల్ల నేతన్నలకు బకాయిలు చెల్లించలేదు. కాంగ్రెస్ వచ్చాక వెంటనే వాటిని విడుదల చేశాం. 63 లక్షల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఏటా 2 చీరలు ఇవ్వాలని నిర్ణయించాం. చేనేతల రుణభారం రూ.30 కోట్లు తీర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కుల, చేతి వృత్తులకు సముచిత న్యాయం చేస్తాం" అని రేవంత్‌రెడ్డి తెలిపారు. నైపుణ్యం గల చేనేత కళాకారులు, నూతన ఆవిష్కర్తల కోసం ఐఐహెచ్‌టీ ప్రారంభించారు. చేనేత రంగంలో ఆవిష్కర్తల ప్రోత్సాహానికి ప్రత్యేక కోర్సులు, శిక్షణ కార్యక్రమాలను ఇక్కడ అందించనున్నారు. అధునాతన పరిశోధన అవకాశాలను ఈ సంస్థ కల్పించనుంది. ఏటా 60 మందికి టెక్స్‌టైల్ టెక్నాలజీలో డిప్లొమా కోర్సులు ఇవ్వనున్నారు.

# అసెంబ్లీ కమిటీలకు చైర్మన్లను నియామకం.. ఎవరెవరంటే



హైదరాబాద్ : శాసనసభకు సంబంధించి మూడు కమిటీలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సోమవారం ప్రకటించారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ గా అరికెపూడి గాంధీ, ఎస్టిమేషన్ కమిటీ చైర్మన్‌గా(అంచనాల కమిటీ) పద్మావతిరెడ్డి, పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ చైర్మన్‌గా శంకరయ్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ చైర్మన్‌గా షాద్ నగర్ ఎమ్మెల్యే కె శంకరయ్యని నియమించారు. ఈ మేరకు అసెంబ్లీ కార్యదర్శి వి.నరసింహాచార్యులు ఉత్తర్వులు జారీ చేశారు.

2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను తెలంగాణ శాసన సభ మొత్తంగా 3 ఆర్థిక కమిటీలను ఏర్పాటు చేసిందనమాట. అన్ని కమిటీల్లోనూ మొత్తం 12 మంది చొప్పున సభ్యులు ఉండనున్నారు.

**మండిపడిన హరీశ్ రావు..** ప్రతిపక్ష పార్టీ నేతకు పీఏసీ చైర్మన్ పదవి ఇవ్వడం ఆనవాయితీగా వస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఆ పదవి ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. అరికెపూడి గాంధీకి ఆ పదవి కట్టబెట్టడం హాస్యాస్పదమన్నారు. అయితే.. పీఏసీ పదవి కోసం బీఆర్ఎస్ నుంచి హరీశ్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్ నామినేషన్ వేసిన విషయం తెలిసిందే.

# మేడారం ఘోర విపత్తుపై ఎన్ఆర్ఎస్సీ విచారణ



వరంగల్, సెప్టెంబర్ 9: ములుగు జిల్లా మేడారం అడవుల్లో ఘోర విపత్తుపై ఎన్ఆర్ఎస్సీ, వాతావరణ శాఖ విచారణ చేపట్టింది. అడవుల్లో వాతావరణ పరిస్థితులను ఎన్ఆర్ఎస్సీ నమోదు చేసుకుంది. 2018 జనవరి 22న మేడారంలోని చిలకల గుట్టలో టోర్నడోలాంటి సుడిగాలి బీభత్సం సృష్టించింది. ఆనాడు సుడిగాలి ఫోటోలను ఆంధ్రజ్యోతి ఫోటో గ్రాఫర్ వీరగోని హరీష్ క్యాప్చర్ చేశారు. మేడారంలో అడవుల్లో టోర్నడోలా బీభత్సం వల్లే అడవులు ధ్వంసమైనట్లు అధికారులు నిర్ధారణకు వస్తున్నారు. అలాగే మేడారం అడవుల్లో ఘోర విపత్తుపై ప్రభుత్వానికి అటవీ రక్షణ ప్రధానాధికారి డోబ్రియాల్ని రెండు రోజుల క్రితం నివేదిక ఇచ్చారు. క్లౌడ్ బరస్ట్ వల్లే ఈ విపత్తు సంభవించిందని... మేఘాలు కిందకు వచ్చి బరస్ట్ కావడంతోనే చెట్లు నేలకూలాయని తెలిపారు. 3 కిలోమీటర్ల పొడవు, 2 కిలో మీటర్ల వెడల్పులో 204 హెక్టార్లలో 50వేల చెట్లు కూలాయన్నారు. క్లౌడ్ బరస్ట్ ఎందుకు జరిగిందో తెలుసుకోవాలని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ తెలియజేశామన్నారు. కూలిన చెట్లను వారంలోగా డిపోలకు తరలిస్తామన్నారు. మేడారం అడవుల్లో చెట్ల వేళ్లు లోతుగా లేవని... అందుకే వందల ఎకరాల్లో అడవి ధ్వంసమైందని ప్రభుత్వానికి పంపిన నివేదికలో పీసీసీఎఫ్ పేర్కొన్నారు. కాగా.. ఆగస్టు 31న ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అడవుల్లో సుమారు 50 వేల చెట్లు నేలమట్టమైన విషయం తెలిసిందే. 200 హెక్టార్లలో విస్తరించి ఉన్న ఈ అడవుల్లో పెద్దఎత్తున గాలిదుమారం, సుడిగాలుల బీభత్సంతో మహావృక్షాలు సైతం చిగురుటాకుల్లా రాలిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నెల 1న పరిశీలనకు వెళ్లిన అధికారులు.. ఈ దృశ్యాలను చూసి, షాక్‌కు గురయ్యారు. అయితే.. టోర్నడోల్లాంటి బలమైన సుడిగాలులే ఈ స్థాయిలో చెట్లను కూల్చివేస్తాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. "టోర్నడోలు ఒక స్పష్టమైన మార్గంలో వెళ్తాయి. కుప్పకూలిన చెట్లు కూడా ఒకవైపే పడి ఉన్నాయి. భారీ వృక్షాలు కూడా నేలకొరగడాన్ని బట్టి.. కనీసం గంటకు 120 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులే దీనికి కారణమై ఉండొచ్చు" అని వివరించారు. అయితే 50 వేల చెట్లు ఒకేసారి నేలకొరగడంపై సమగ్ర విచారణ జరుపుతున్నట్లు అటవీ అధికారులు తెలిపారు. ఈ ఘటనపై డీఎఫ్‌వో రాహుల్ జావేద్ నేతృత్వంలోని బృందం ఉపగ్రహ డేటా, భారత వాతావరణ శాఖ(ఐఎండీ), నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్‌సీ)తో కలిసి పరిశీలన జరుపుతోంది. మంగళవారం ఆయన.. సీసీఎఫ్ ప్రభాకర్‌తో కలిసి తాడ్వాయ్–మేడారం అడవుల్లో నేలమట్టమైన చెట్లను పరిశీలించారు.

# హైకోర్టు తీర్పుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేల హర్షం



హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే ఈ విషయంపై బీఆర్ఎస్ పార్టీ హై కోర్టులో ఎమ్మెల్యేలకు సంబంధించి అనర్హత పిటిషన్ వేసింది. ఈరోజు (సోమవారం) తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా కీలక తీర్పు వెలువరించింది. అయితే తెలంగాణ హైకోర్టు తీర్పుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు అద్భుతమైన తీర్పు ఇవ్వటాన్ని స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో ఇన్సెంటివ్స్ ఇచ్చి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారని ఆరోపణలు చేశారు. సోమవారం నాడు తెలంగాణ భవన్‌లో పాడి కౌశిక్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ డబుల్ స్టాండ్ ఏంటి అని ప్రశ్నించారు. హిమాచల్ ప్రదేశ్‌లో ఒకలా... తెలంగాణలో మరోలా కాంగ్రెస్ నేతలు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు చేశారు. తెలంగాణలో ఇన్సెంటివ్స్ ఇచ్చి పార్టీలో చేర్చుకున్నారని ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి క్యారెక్టర్ లేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ సబ్ రీజనల్ పార్టీగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి అవినీతి సొమ్ముతో పది మంది ఎమ్మెల్యేలను రూ.1000 కోట్లు పెట్టి కొన్నారని సంచలన ఆరోపణలు చేశారు. ఒక్క నెలలో హైదరాబాద్ రోడ్ల మీద ఖైరతాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను ఉరికిస్తామని పాడి కౌశిక్‌రెడ్డి మాస్ వార్నింగ్ ఇచ్చారు. హైకోర్టు తీర్పు బీఆర్ఎస్ పార్టీకి విజయమని కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు.

**అనర్హత వేటు విషయంలో కాలయాపన చేయొద్దు: ఎమ్మెల్యే వివేకానంద గౌడ్** : ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ అన్నారు. తెంగాణ అసెంబ్లీ స్పీకర్ స్వతంత్రంగా వ్యవహరించి.. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరారు. స్పీకర్ మీద తమకు పూర్తి విశ్వాసం ఉందని వివేకానంద గౌడ్ తెలిపారు. కాంగ్రెస్‌కు ఢిల్లీలో ఒక విధానం తెలంగాణలో మరో విధానమా అని ప్రశ్నించారు. అనర్హత వేటు విషయంలో కాలయాపన చేస్తే అపహాస్యం కాక తప్పదని విమర్శలు చేశారు. మూడు స్థానాలకు ఉప ఎన్నికలు రాబోతున్నాయని స్పష్టం చేశారు. ముగ్గురు ఎమ్మెల్యేలతో మిగతా వారిపై కూడా నిర్ణయం తీసుకుని వేటు వేయాలని ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ తెలిపారు.

# ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పోటీ మాత్రమే చేశాం

హైదరాబాద్, సెప్టెంబర్ 9: ప్రభుత్వంలో సీపీఐ భాగస్వామ్యం కాదంటూ ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలసి పోటీ మాత్రమే చేశామని స్పష్టం చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల పదవిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించటానికి కాంగ్రెస్ ప్రభుత్వం భయపడ్తోందన్నారు. ప్రభుత్వంలో భాగస్వామ్యం అయితే సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించే వాళ్ళమని తెలిపారు. కేంద్రం తెలంగాణ రాష్ట్రంపై వివక్ష చూపొద్దని విజ్ఞప్తి చేశారు.

మానవత్వంతో కేంద్రం రాష్ట్రానికి సహాయం చేయాలన్నారు. జాతీయ విపత్తు కింద తెలంగాణకు కేంద్రం 6వేల కోట్లు ఇవ్వాలని... కానీ తమ అంచనా ప్రకారం 10,000 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్లు కూలిపోయిన, దెబ్బతిన్న ఇళ్లకి, పంట నష్టానికి రూ.10వేలు సరిపోవన్నారు. నష్టపోయిన దానిలో కనీసం సగం అయిన ఇవ్వాలన్నారు. "మావోయిస్టులు ఏమైనా రాక్షసులా? నక్సల్‌పై అమిత్ షాకు ఎందుకంత కక్ష?" అని ప్రశ్నించారు. మావోయిస్టులతో చర్చలు జరపాలన్నారు. మావోయిస్టుల విషయంలో కేంద్రం మాయలో పడి రాష్ట్ర ప్రభుత్వం తప్పులు చేయకూడదని హితవుపలికారు. సెప్టెంబర్ 11నుంచి 17వరకు రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు జరుపుతామన్నారు. సెప్టెంబర్ 21వ తేదిన భారీ బహిరంగ సభ ఉంటుందని కూనంనేని సాంబశివరావు వెల్లడించారు.



# సీబీఐకి సవాల్‌గా మారిన కోల్‌కతా హత్యాచార కేసు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో వెలుగు చూసిన ఘోర హత్యాచార ఘటన జరిగి సరిగ్గా నెల రోజులవుతోంది. తొలుత బెంగాల్ పోలీసులు ఈ కేసును దర్యాప్తు చేయగా.. ఇప్పుడది సీబీఐ పరిధిలో ఉంది. కానీ ఇంతవరకు ఈ విచారణ ఒక కొలిక్కి రాలేదు. దర్యాప్తు సంస్థకు ఈ కేసు సవాల్‌గా మారిందని తెలుస్తోంది. దీనిపై సీబీఐ అధికారి ఒకరు మీడియాతో మాట్లాడారు. నేరం జరిగిన ప్రాంతంలో తగిన ఆధారాలు లభించకపోవడంతో, ఆ ప్రభావం దర్యాప్తుపై పడుతోందన్నారు. ఆ డాక్టర్ మృతదేహం దొరికిన మరుసటి రోజు సెమినార్ హాల్ సమీపంలో ఉన్న రెస్ట్‌రూం, టాయిలెట్‌ను కూల్చివేయాలని ఆర్జీ కర్ వైద్య కళాశాల మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ ఆదేశించినట్లు సీబీఐ గుర్తించింది. అప్పుడే కీలక ఆధారాలు మిస్ అయినట్లు తాము అనుమానిస్తున్నట్లు చెప్పారు. అలాగే మృతదేహాన్ని గుర్తించిన వెంటనే సెమినార్ హాల్ వద్ద భారీగా జనం గూమిగూడినట్టుగా ఉన్న ఒక వీడియో వైరల్ అయింది. ఈ ఘటనకు నిరసనగా ఆగస్టు 14న అర్ధరాత్రి చేపట్టిన ఆందోళన ఆసుపత్రిలో విధ్వంసానికి దారితీసింది. ఈ రెండు సందర్భాల్లో ఆధారాలు ధ్వంసమయ్యాయా..? అనే అనుమానాలు తలెత్తాయి. కానీ కోల్‌కతా పోలీసులు అలాంటిదేమీ జరగలేదని వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే.. ఈ ఘటనపై బాధితురాలి తల్లిదండ్రులు హైకోర్టులో వేసిన పిటిషన్‌లో.. గ్యాంగ్ రేప్ జరిగి ఉండొచ్చన్న అనుమానాలు లేవనెత్తారు. ఆధారాలు మొత్తం తారుమారయ్యాయని ఆరోపించారు. ఈ పరిణామాలన్నింటిని ఉద్దేశించి సీబీఐ అధికారి మాట్లాడుతూ.."ఈ కేసులో తగిన ఆధారాలు లేవు. అందుకే మా అధికారులు తొందరగా ఓ కొలిక్కి రాలేకపోతున్నారు. డీఎన్ఏ ఫలితం, ఘటనా స్థలంలో లభించిన ఆధారాలు, పలువురిని ప్రశ్నించిన మీదట లభించిన వివరాల ప్రకారం.. ఆ డాక్టర్‌పై జరిగిన దాడిలో ఒకరికి మించిన వ్యక్తుల ప్రమేయం లేదని వెల్లడైంది. ఘటనా స్థలంలో సేకరించిన నమూనాలు.. రాయ్ నమూనాలతో మ్యాచ్ అయ్యాయి" అని అన్నారు. ఇదిలా ఉండగా.. అసలైన నేరస్థుల కాపాడేందుకు సంజయ్‌ను ఇరికించారని అతడి తరఫు న్యాయవాది వాదిస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు, కేసు విచారణలో భాగంగా ఆసుపత్రిలో చోటుచేసుకున్న ఆర్థిక అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. దాంతో మాజీ ప్రిన్సిపల్ ఘోష్‌తో సహా మరో ముగ్గురిని సీబీఐ అరెస్టు చేసింది. ఈడీ కూడా ఈ అక్రమాలను విచారిస్తోంది. ఆర్జీ కర్ ఆసుపత్రిలోని సెమినార్ రూమ్‌లో ఆగస్టు 9న పీజీ వైద్య విద్యార్థి విగత జీవిగా కనిపించి ఉండటాన్ని గుర్తించారు. తొలుత ఆత్మహత్య చేసుకుందని అధికారులు చెప్పినప్పటికీ.. హత్యాచారమని దర్యాప్తులో గుర్తించారు.



# నదిలో మునిగిన కారు.. టాప్‌పై జంట!

## రెండు గంటల పాటు ఉత్కంఠ

అహ్మదాబాద్: నదిలో నిండా మునిగిన కారు.. అతికష్టమ్మీద టాప్ పైకి ఎక్కి కూర్చున్న జంట.. వరద ఉధ్ధృతి కారణంగా సహాయక బృందం కూడా వారిని రక్షించలేని పరిస్థితి.. వారు ప్రాణాలతో బయటపడగలరా లేదా అని ఊపిరిబిగబట్టి చూస్తున్న జనం.. ఇలా ఏకంగా రెండు గంటల పాటు ఉత్కంఠ కొనసాగగా, చివరకు నీటి ఉధ్ధృతి తగ్గడంతో వారిని కాపాడగలిగారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గుజరాత్‌లో ఆదివారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు వైరల్‌గా మారాయి. భారీ వర్షాలతో గుజరాత్‌లో నదులు పొంగి పొర్లుతున్నాయి. ఈ క్రమంలో సాబర్‌కాంతా జిల్లాకు చెందిన సురేశ్ మిస్త్రీ అనే వ్యక్తి తన భార్యతో కలిసి కారులో వెళ్తూ కరోల్ నదిని దాటేందుకు యత్నించారు. మధ్యలోకి వెళ్లగానే నీటి ఉధ్ధృతి పెరిగింది. దీంతో ఆ ప్రవాహంలో 1.5 కి.మీ దూరం కొట్టుకుపోయిన ఆ కారు.. చివరకు ఓ చోట ఆగిపోయింది. వరద మరింత పెరిగి.. కారు పైభాగం మాత్రమే కనిపించే స్థాయికి చేరుకుంది. అప్పటికే మిస్త్రీ దంపతులు అతి కష్టం మీద బయటకు వచ్చి వాహనం పైభాగానికి చేరుకున్నారు. కారు పైభాగంలో కూర్చొని తమ ఫోన్‌తోనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బందితో పాటు స్థానికులు భారీ సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. వరద ఉధ్ధృతి కొనసాగుతుండటంతో వారిని బయటకు తీసుకురాలేకపోయారు. అలా దాదాపు రెండు గంటలపాటు మిస్త్రీ దంపతులు వాహనం పైభాగంలోనే కూర్చుండిపోయారు. చివరకు నీటి ప్రవాహం కాస్త తగ్గడంతో సహాయక బృందాలు వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చాయి.

# పండగల వేళ విమాన టికెట్ ధరలపై కేంద్రం హెచ్చరిక



దిల్లీ: పండగల సీజన్ వచ్చిందంటే దేశంలో వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకునే వారంతా సొంతూళ్లకు పయనమవుతుంటారు. అదే అదనుగా ఆ సమయంలో విమాన టికెట్ల ధరలు ఆకాశాన్నంటుతుంటాయి. దీనిపై తాజాగా కేంద్రం స్పందించింది. టికెట్ ధరలపై ఒక కన్నేసి ఉంచినట్లు తెలిపింది. పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.."పండగ సీజన్‌లో ఎక్కువమంది ప్రయాణించే మార్గాల్లో విమానయాన సంస్థలు వసూలు చేస్తున్న టికెట్ ధరలను మేం గమనిస్తున్నాం. పండగ సమయంలో ప్రతి ఒక్కరూ ఇంటికి వెళ్లాలని కోరుకుంటారు. అలాంటి వేళ.. ప్రయాణికులకు అసౌకర్యం కలగకూడదని ఇప్పటికే అన్ని విమానయాన సంస్థలకు చెప్పాం. ఏ సంస్థా ఒక విధమైన టికెట్ ధర వసూలు చేయాలని ఒత్తిడి చేయం. అయితే ధరలు మరీ ఎక్కువగా లేకుండా చూసుకోవాలి" అని మంత్రి వ్యాఖ్యానించారు. కొవిడ్‌తో దెబ్బతిన్న విమానయాన రంగం పూర్తిగా కోలుకోలేదు. అందుకు దేశీయ స్పైస్‌జెట్ ఒక ఉదాహరణ. అది ప్రస్తుతం ఆర్థిక కష్టాలు, న్యాయపరమైన చిక్కులు ఎదుర్కొంటోంది. ఈ సంస్థ నిధుల సమీకరణ పనిలో పడింది. ఇలాంటి సమయంలోనే ఇండియా రీజినల్ ఎయిర్ మొబిలిటీ కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడారు. స్పైస్‌జెట్ పరిస్థితిని గమనిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఈ రంగం భవిష్యత్తు కోసం ప్రభుత్వ ప్రణాళికను వివరించారు. "2035 నాటికి భారత్ అతిపెద్ద ఏవియేషన్ మార్కెట్‌గా అవతరిస్తుంది. ఈ వృద్ధికి తోడ్పాటునందించేందుకు రానున్న 10 నుంచి 20 ఏళ్లలో దేశంలో 350 నుంచి 400 విమానాశ్రయాలను నిర్మించాలని ప్లాన్ చేస్తున్నాం. మౌలిక సదుపాయాలపై మేం భారీగా పెట్టుబడులు పెడుతున్నాం. భవిష్యత్తు మార్కెట్ కోసం ఇప్పుడే పునాది వేస్తున్నాం" అని తెలిపారు.

# గణేష్ నిమజ్జనానికి భారీ భద్రత.. రాచకొండ సీపీ సుధీర్ బాబు కీలక ఆదేశాలు

హైదరాబాద్: నగరంలో జరిగే గణేష్ నిమజ్జనోత్సవానికి హైదరాబాద్ సిటీ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. కాగా, సరూర్‌నగర్ మినీ ట్యాంక్ బండ్‌పై వినాయక విగ్రహాల నిమజ్జనం ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. నిమజ్జనం ఏర్పాట్లను రాచకొండ సీపీ సుధీర్ బాబు ఈరోజు(సోమవారం) పరిశీలించారు. అనంతరం మీడియాతో సీపీ సుధీర్ బాబు మాట్లాడుతూ... రాచకొండ పరిధిలో వినాయక విగ్రహాల నిమజ్జనానికి పదివేల మందితో భద్రత ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. సరూర్‌నగర్ మినీ ట్యాంక్ బండ్ కట్టపై 70 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విగ్రహాలు తరలి వెళ్లే మార్గంలో 200కు పైగా సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామని రాచకొండ సీపీ సుధీర్ బాబు వెల్లడించారు. ప్రస్తుతం మూడు క్రేన్‌లతో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేస్తామని తెలిపారు.

మహా నిమజ్జనం నాటికి ఎనిమిది క్రేన్‌లను అందుబాటులో ఉంచుతున్నట్లు వివరించారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటున్నామని చెప్పారు. భక్తుల సౌకర్యం కోసం తాగునీరు, మొబైల్ టాయిలెట్స్, ట్యాంక్ చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశామని అన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం సీసీ కెమెరాల నిఘాతో, పోలీసు సిబ్బంది గస్తీ ఉంటుందని రాచకొండ సీపీ సుధీర్ బాబు పేర్కొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com